http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 27 ఏప్రిల్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## చొరబాటుదారులను బహిష్కరిస్తాం!

- మమత, కాంగ్రెస్ హయాంలో ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించారు
- మే 5 తర్వాత చొరబాటుదారులను ఏరివేస్తాం
- కనికరం లేకుండా గూండాల ఆటకట్టిస్తాం
- బంగాల్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా హెచ్చరికలు

2

## వివరాలు చెబితే పథకాలు రావనే

# అపోహ వద్దు



- గవర్నర్, సీఎం సహా ప్రముఖుల 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'
- మే 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న జనగణన కార్యక్రమం
- తొలిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణ
- స్వీయ ధృవీకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

జనగణనలో భాగంగా రాష్ట్రంలో స్వీయ ధ్రువీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు శ్రీకారం చుట్టారు. మే 10 వరకు రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరగనుంది. తొలిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కలు సేకరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సహా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో జనగణన సందడి ప్రారంభమైంది. జనగణన–2027 స్వీయ నమోదు కార్యక్రమాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో తన వివరాలు నమోదు చేసి, అధికారికంగా మొదలుపెట్టారు. రాష్ట్రం ఏర్పడ్డాక మొదటి జనగణన కావడం వల్ల ప్రాముఖ్యతను సంతరించుకుందని గవర్నర్ అన్నారు. రాష్ట్ర పురోగతికి కచ్చితమైన సమాచార సేకరణ చాలా కీలకమన్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి పూర్తి డిజిటల్ - మిగతా3లో



## ప్రతి ఊళ్లో పార్టీ జెండా

# ఎగురవేయండి

- బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుంది
- ఆహ్వానం ఉన్న వారు మాత్రమే హాజరుకావాలి
- మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలను ఘనంగా నిర్వహించాలి
- పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలి

## ఉపాధ్యాయ బదిలీలపై

# అయోమయం!

- ఆ కారణంగా మరింత సమయం పట్టే అవకాశం
- జనగణనలో పాల్గొనే వారికి 2027 మార్చి వరకు వద్దన్న కేంద్రం
- 80 శాతం ఉపాధ్యాయులు జనగణన విధుల్లోనే
- జులైలో స్థానచలనం జరపాలంటున్న సంఘాలు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేసినప్పటికీ ఉపాధ్యాయుల స్థానచలనం వ్యవహారం మాత్రం మరింత సంక్లిష్టంగా మారింది. జనగణన మొదలు కానుండటం 70–80 శాతం మంది టీచర్లు ఆ విధుల్లో పాల్గొంటుండటం కారణంగా బదిలీలపై అయోమయం నెలకొంది. మొదటి దశ జనగణన మే 11– జూన్ 9వ తేదీల మధ్య కొనసాగనుంది. అంటే ఆ మధ్య కాలంలో టీచర్ల బదిలీలకు అసలే వీల్లేదు. కేంద్ర హోంశాఖ మాత్రం 2027 మార్చి వరకు జనాభా లెక్కల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులను బదిలీ చేయవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. తొలి విడతలో ఇళ్ల వివరాలను సేకరిస్తున్నారు. - మిగతా3లో

## దీదీ రాజ్యంలో ప్రజాస్వామ్యం ఖూనీ



- రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్యం కాదు
- తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) గూండారాజ్ నడుస్తోంది
- బెంగాల్‌లో ప్రజాస్వామ్యం కనుమరుగైంది
- కేవలం టీఎంసీ గూండాల రాజ్యమే నడుస్తోంది

## మహిళలపై అత్యాచారాలకు పాల్పడే దుర్మార్గులను శిక్షిస్తాం



- మహా జంగిల్ రాజ్ నుంచి విముక్తి కల్పిస్తాం
- బంగాల్‌లో నేతలు 'మా'ను ఏడిపించారు
- మహిళలను హింసించే గూండాలకు అండగా నిలుస్తున్నారు
- మోదీ విమర్శలు

2

## ప్రజలకు మరింత చేరువగా

# ప్రజావాణి

- ప్రజావాణి వ్యవస్థను రెవెన్యూ డివిజన్ స్థాయికి విస్తరించాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించిన సీఎం
- ప్రజావాణి సేవలను రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభించాలని సూచన
- ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు
- ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు



హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. ఇవాళ ఉదయం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజావాణిపై మాట్లాడారు. దూర ప్రాంతాల - మిగతా3లో



## ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

- రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన ఆప్
- ఆప్‌ను వీడిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు
- వారిపై అనర్హత వేటు వేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన ఆమ్ ఆద్మీ

## నిరీక్షణకు తెర

- అజారుద్దీన్, కోదండరాంను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ నోటిఫికేషన్ జారీ
- మూడేళ్ల నిరీక్షణకు నేటితో తెర
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకమైన అజారుద్దీన్, కోదండరాం





## టేకాఫ్ అవుతుండగా స్విస్ విమానంలో మంటలు

- ఎమర్జెన్సీ ప్రకటించిన దిల్లీ ఎయిర్‌పోర్ట్
- దిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో స్విస్ విమానం టేకాఫ్ అవుతుండగా ప్రమాదం
- ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- ఎమర్జెన్సీ స్లైడ్స్ ద్వారా ప్రయాణికులను కిందకు దించిన సిబ్బంది

## జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి

- తొలిసారిగా క్రిటికాలిటీ దశకు 'కల్పకం' న్యూక్లియర్ రియాక్టర్
- ఇదొక చారిత్రక మైలురాయి: ప్రధాని మోదీ
- సెల్ఫ్ ఎన్యుమరేషన్‌తో సమయం ఆదా
- బ్రెజిల్ జూన్ను పోటీల్లో భారత్ విజయాలు భేష్
- మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ




# చొరబాటుదారులను బహిష్కరిస్తాం!

బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడియాలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. గతంలో బంగాల్‌లో మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబించాయని ఆరోపించారు. కానీ 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి సర్జికల్?, ఎయిర్ స్ట్రైక్స్ లాంటి చర్యలతో ఉగ్రదాడులకు నిర్ణయాత్మకమైన సమాధానం ఇచ్చిందని అన్నారు. "మమతా బెనర్జీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించేవారు. 2014లో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చాక, ఉరీలో దాడి జరిగితే మేము సర్జికల్ స్ట్రైక్ చేశాం. పుల్వామాలో దాడి జరిగితే ఎయిర్ స్ట్రైక్ నిర్వహించాం. పహల్గాంలో దాడి చేసినప్పుడు, నేరుగా పాక్? గడ్డపైకి వెళ్లి ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించాం. ప్రధాని మోదీ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారు."

**చొరబాటుదారులను బహిష్కరిస్తాం!**

బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అక్రమ చొరబాటుదారులను గుర్తించి, వారిని బహిష్కరిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. "ప్రధాని మోదీ ఈ దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేశారు. ఇప్పుడు బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురండి. మేము చొరబాటుదారులను ఒక్కొక్కరిగా ఏరిపారేస్తాం. చొరబాటుదారుల పేర్లను ఎందుకు తొలగిస్తున్నారని దీదీ అడుగుతున్నారు? దీదీ మీ సమయం



ముగిసింది. మే 4వ తేదీన బీజేపీ ప్రభుత్వం రానుంది. బీజేపీ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత, మేము ఓటర్ల జాబితా నుంచి చొరబాడుదారులను తొలగించడమే కాకుండా, బంగాల్ గడ్డ నుంచి వారిని ఏరిపారేస్తాం."

**టీఎంసీని తుడిచిపెట్టేశారు!**

నాడియా జిల్లాలోని టెహట్టాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శల జల్లు కురిపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలోనే ఓటర్లు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేశారని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 23న జరిగిన మొదటి దశ ఎన్నికల్లోనే బీజేపీ 110 సీట్లను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'బంగాల్ బాధ్యతలు బీజేపీ చేపడితే ఇక్కడ కొనసాగుతున్న గూండా రాజ్యం, సిండికేట్? రాజ్?లకు ముగింపు లభిస్తుంది. ఓటు వేసేందుకు బయటకు రావడానికి ఎవరూ భయపడకండి. ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసింది. మిమ్మల్ని ఓటు వేయకుండా ఆపడం ఎవరి వల్లా కాదు' అని అమిత్? షా ఓటర్లకు పిలుపునిచ్చారు. అయితే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో, అమిత్? షా తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది.

సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా ఈ సీనియర్ బీజేపీ నేత తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది

**గూండాల పనిపడతాం!**

అంతకు ముందు, అంటే శనివారం టోలీగంజ్?లో అమిత్? షా భారీ రోడ్? షో నిర్వహించారు. ఆ సందర్భంగా బంగాల్? ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే, టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. "నేను ఇప్పుడు గూండాలకు హెచ్చరిస్తున్నా. ఏప్రిల్ 29న మీ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. లేకపోతే మే 5వ తేదీ తర్వాత మీపై కనికరం ఉండదు. ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు తల్లులు, సోదరీమణులు, యువకులు అందరూ పోలింగ్ బూత్?లకు చేరుకుని కమలం గుర్తుపై బటన్? నొక్కాలని నేను కోరుతున్నాను" అని అన్నారు. కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 91.78 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# మహిళలపై అత్యాచారాలకు పాల్పడే దుర్మార్గులను శిక్షిస్తాం

మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడే దుర్మార్గులను మే 4 తర్వాత అధికారంలోకి వచ్చే బంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బంగాల్‌లోని బోంగావ్‌లో రెండో విడత పోలింగ్‌కు మోదీ ప్రచారం నిర్వహించారు. సందేశ్‌ఖాలీ బాధితురాలికి, ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి బీజేపీ టికెట్లు కేటాయించిందని ఈ సందర్భంగా మోదీ గుర్తుచేశారు. ఈ నిర్ణయం ద్వారా బంగాల్ మహిళల పట్ల బీజేపీకి ఉన్న నిబద్ధత స్పష్టమైందని వ్యాఖ్యానించారు. టీఎంసీ ప్రభుత్వం బంగాల్ మహిళలను హింసించే గూండాలకు అండగా నిలుస్తోందని, ఇకపై దీనిని ప్రజలు సహించబోరన్నారు. టీఎంసీ సృష్టించిన మహా జంగల్ రాజ్ నుంచి బీజేపీ విముక్తి కల్పిస్తుందన్నారు. బంగాల్ ఎన్నికల మొదటి దశలోనే టీఎంసీ అహంకారం బద్దలైందని, రెండో దశ ఎన్నికలు బీజేపీ విజయాన్ని ఖాయం చేస్తాయని మోదీ జోస్యం చెప్పారు. అంతేకాదు 'మా, మాటి, మనుష్' (తల్లి, నేల, ప్రజలు) అనే నినాదానికి టీఎంసీ తూట్లు పొడిచిందని మోదీ ఆరోపించారు. రాష్ట్రాన్ని జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేసేందుకు తమ బీజేపీ పార్టీకి ఓటు వేయాలని బంగాల్ ప్రజలను కోరారు.

బంగాల్ రెండో దశ పోలింగ్ కోసం ఎన్నికల ప్రచారం చేస్తున్న మోదీ, విజయ్ సంకల్ప్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలమైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికార టీఎంసీపై విమర్శల వర్షం కురిపించారు. "టీఎంసీ ఇక్కడ తల్లులను ఏడిపించింది. మాతృభూమిని సిండికెట్లు, చొరబాటుదారులకు అప్పగించింది. సామాన్య ప్రజలను బహిష్కరణకు గురయ్యేలా చేసింది" అని ఆయన



మండిపడ్డారు. "మొదటి దశలో బంగాల్ కమాల్ కర్ దియా (అద్భుతం చేసింది). ఏప్రిల్ 29న జరగనున్న చివరి దశ ఎన్నికల్లో కూడా అదే తరహా మద్దతు తెలపాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ అహంకారం అణగిపోయింది. ఇప్పుడు రెండో దశలో బీజేపీ చారిత్రాత్మక విజయం ఖాయం కానుంది. బంగాల్ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. 15 ఏళ్ల క్రితం 'మా, మాటి, మనుష్'? నినాదంతో టీఎంసీ అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పుడు వారు ఆ మాటలు కూడా పలకడం లేదు. ఎందుకు? ఒకవేళ ఆ నినాదాన్ని గుర్తుచేసుకుంటే, వారి పాపాలు బయటపడతా యని వారికి తెలుసు. టీఎంసీ క్రూరత్వం వల్ల తల్లులు కన్నీరు పెడుతున్నారు. ఇక్కడి నేల చొరబాటుదారుల పరమైపోయిం ది. స్థానిక ప్రజలు సొంత నేల నుంచి వెలివేయబడ్డారు."

**జంగిల్ రాజ్ నుంచి విముక్తి**

బంగాల్‌ను టీఎంసీ జంగిల్ రాజ్ నుంచి బీజేపీ విముక్తి చేస్తుందని మోదీ పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నినాదాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ, "బంగాల్ వద్ద అన్నీ ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు అపారమైన సామర్థ్యం ఉంది. అందుకే బంగాల్ మళ్లీ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రం కాగలదు. 'మీరు నాకు రక్తం ఇవ్వండి. నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను' అన్న నేతాజీ పిలుపును గుర్తుంచుకోవాలి. ఆయన పిలుపునకు స్పందించి దేశ ప్రజలు సర్వస్వం త్యాగం చేశారు. అదే విధంగా ఈ రోజు బంగాల్?కు మీ నుంచి కేవలం ఒక ఓటు కావాలి. మాకు మీ దీవెనెలతో సహా ఓటు అందించండి. మిమ్మల్ని మేము టీఎంసీ పాలన నుంచి విముక్తి చేస్తాం" అని మోదీ పేర్కొన్నారు.

**రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్న టీఎంసీ**

బంగాల్ పారిశ్రామిక వృద్ధిని టీఎంసీ అడ్డుకుందని, అవినీతి, సిండికేట్ రాజ్యానికి తెరలేపిందని మోదీ ఆరోపించారు. "టీఎంసీ జంగిల్ రాజ్‌తో ఒక అల్పస్థాయి మంత్రి లేదా గూండా కూడా తానే సర్వస్వం అని భావించే పరిస్థితి వచ్చింది. 24 పరగణాలు, హూగ్లీ నదీ పరివాహక ప్రాంతాలు ఒకప్పుడు పరిశ్రమలకు నిలయాలుగా ఉండేవి. కానీ నేడు అక్కడి మిల్లులు మూతపడుతున్నాయి. బ్రిటీష్ కాలం నాటి ఫ్యాక్టరీలు కూడా మూతపడ్డాయి. కేవలం సిండికేట్, లంచగొండితనంతో నడిచే ఒకే ఒక వ్యాపారం అక్కడ సాగుతోంది" అని ఆయన ఆరోపించారు. కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 91.78 శాతం పోలింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి

భారత్‌లోనే తొలిసారిగా తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం చారిత్రక మైలురాయి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ ఘన విజయాన్ని సాధించడం ద్వారా భారత అణు శాస్త్రవేత్తలు దేశానికి కీర్తిని సాధించి పెట్టారని ప్రశంసించారు. ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్‌ను తొలిసారిగా క్రిటికాలిటీ దశకు చేర్చడంలో భాగమైన శాస్త్రవేత్తలు సహా ప్రతీ ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, సులభతరం చేసేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. ఆదివారం రోజు మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈవివరాలను వెల్లడించారు.

**పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో రియాక్టర్**

కొన్ని రోజుల క్రితమే (ఏప్రిల్ 6న) కల్పకంలోని న్యూక్లియర్ రియాక్టర్ పూర్తిస్థాయిలో స్వయంగా పని చేయడం మొదలుపెట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆ న్యూక్లియర్ రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతోనే తయారు చేయడం అనేది పెద్ద విషయమన్నారు. ఇంధన రంగంలో దేశం సాధించిన ఈ విజయం వికసిత భారత్ లక్ష్యానికి కొత్త శక్తిని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 మార్చిలో కల్పకంలో రియాక్టర్ లోడింగ్ దశను నేరుగా వీక్షించే గొప్ప అవకాశం తనకు లభించిందని మోదీ తెలిపారు. భారతదేశ పౌర అణు ఇంధన కార్యక్రమం సాధిస్తున్న విజయాల కారణంగా దేశ పారిశ్రామిక, ఇంధన, ఆరోగ్య రంగాల వికాసానికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు, ఆధునిక ఆవిష్కర్తలకూ చేదోడు లభిస్తోందన్నారు. భారతదేశ వికాసంతో సైన్సుకు బలమైన సంబంధం ఉందని మోదీ చెప్పారు. ఈ విజన్‌తోనే భారత శాస్త్రవేత్తలు అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. వారి చొరవల ఫలితంగా అంతరిక్ష కార్యక్రమం సైతం భారతదేశ నిర్మాణానికి గణనీయంగా దోహదపడుతోందని తెలిపారు.

**పవన విద్యుత్ రంగంలో ప్రధాన మైలురాయి**

పవన విద్యుత్ అనేది భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కంటికి కనిపించని ఈ పవన శక్తే భారత్‌ను ముమ్మందుకు నడిపిస్తోందని తెలిపారు. పవన విద్యుత్



రంగంలో భారత్ ఇటీవలే ఒక ప్రధాన మైలురాయిని సాధించిందని, దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటిందన్నారు. కేవలం గత ఏడాది వ్యవధిలోనే దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరో 6 గిగావాట్లు పెరిగిందని మోదీ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసమే కాకుండా, భారత వికాసం, భవిష్యత్తు అవసరాల కోసం సౌర, పవన విద్యుత్‌లు చాలా అవసరమన్నారు. వాటిని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

**జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి**

"ప్రస్తుతం దేశంలో జరుగుతున్న జన గణన-2027 అనేది కేవలం ప్రభుత్వం పని కాదు. అది దేశ పౌరులందరి బాధ్యత. అందరూ చొరవ చూపి ఇందులో భాగస్వాములు కావాలి. జనగణనలో ప్రజలు అందించే సమాచారాన్ని చాలా సురక్షితంగా, విశ్వసనీయంగా దాచి పెడతారు. అందరూ పాల్గొని జనగణనను విజయవంతం చేయాలి. భారత్‌లో జరుగుతున్న జనగణన కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్దది. పూర్తిగా డిజిటల్‌గానే దేశ ప్రజల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారు. ప్రజలు అందించే సమాచారాన్ని ఎన్యుమరేటర్లు అక్కడికక్కడే ప్రత్యేక మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు కూడా ఈసారి అవకాశాన్ని ఇచ్చారు. ప్రజలు తమకు తామే వివరాలను సెన్సస్ పోర్టల్‌లో నమోదు చేయొచ్చు. క్షేత్రస్థాయి ఎన్యుమరేషన్ మొదలుకావడానికి ముందు, 15 రోజుల పాటు ప్రజలు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియను పూర్తి చేసే వారికి మొబైల్ లేదా ఈమెయిల్ ద్వారా ఒక ప్రత్యేక ఐడీని పంపిస్తారు. ఇళ్లకు ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు, ఈ ఐడీని చూపిస్తే సరిపోతుంది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 1.2 కోట్ల కుటుంబాలు గృహ గణనకు సమాచారాన్ని అందించాయి" అని ప్రధాని మోదీ తెలిపారు.

**ఒక వెదురు ఉత్పత్తిని కొనండి**

"భారతదేశంలో వెదురు రంగంలో ఎంతోమంది పనిచేస్తున్నారు. కళాత్మక వెదురు ఉత్పత్తుల తయారీకి వాళ్లంతా శ్రమిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ రంగంపై ఎక్కువగా ఆధారపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు మీరంతా కనీసం ఒక వెదురు ఉత్పత్తిని కొనండి. దీన్ని మీరు ఎవరికైనా గిఫ్టుగా ఇచ్చుకోవచ్చు. వెదురు ఉత్పత్తుల సేల్స్ పెరిగితే ఈ రంగంలో పనిచేస్తున్న వారి ఆత్మస్థైర్యం పెరుగుతుంది" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

**బ్రెజిల్ జున్ను పోటీల్లో భారత్ విజయాలు భేష్**

బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు విజయాలను సాధించడాన్ని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ విజయం భారతదేశ డైరీ రంగానికి చాలా ముఖ్యమైందని చెప్పారు. ఇప్పుడు భారతదేశ రుచి యావత్ ప్రపంచంలోని ప్లేట్లలోకి చేరుతోందన్నారు. భారతదేశ సంప్రదాయ జున్ను ఫ్లేవర్లు ప్రస్తుతం కొత్తరూపుతో ప్రపంచం మొత్తం వ్యాపిస్తున్నాయని ఆయన తెలిపారు.

**చిలీలో భారతీయుడి బౌద్ధ ప్రచారం**

"త్వరలోనే జరగనున్న బుద్ధ పూర్ణిమ సందర్భంగా దేశ ప్రజలకు నేను ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మే నెల ఈ శుభప్రదమైన పండుగతోనే ప్రారంభమవుతోంది. గౌతమ బుద్ధుడి బోధనలు ఏ కాల పరిస్థితుల్లోనైనా మానవ జీవితాలకు వర్తిస్తాయి. ఒత్తిడులు, పోరాటాలు, సవాళ్లతో కూడిన ఈ కాలంలో బుద్ధుడి సందేశం మానవత్వానికి సరైన దిశను చూపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బుద్ధుడి బోధనలు అందరికీ ఎంతో ముఖ్యమైనవిగా మారాయి. శాంతి అనేది మనతోనే ఆరంభం అవుతుందని బుద్ధుడు చెప్పారు. మనిషి తనపై తాను గెలవడమే గొప్ప విజయమని ఆయన బోధించారు. భారత్‌లోని లడఖ్‌లో జన్మించిన ద్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె ఇప్పుడు చిలీ దేశంలో బుద్ధుడి బోధనలను వ్యాప్తి చేస్తున్నారు. ఓట్జెర్ చొరవతో చిలీలోని కోచిగువాజ్ లోయలో బౌద్ధ స్థూపాన్ని నిర్మించారు. అక్కడ ప్రజలకు మెడిటేషన్‌ను నేర్పిస్తున్నారు. కర్ణాటకలోని 100కుపైగా ఎకరాల్లోని అడవుల్లో కర్మ అనే బౌద్ధ ఆశ్రమం ఉంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## 'ఆ ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయండి'

తమ పార్టీని వీడి ఇటీవలే బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పిటిషన్ సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఆ ఏడుగురు ఎంపీల చర్య పార్టీ ఫిరాయింపు నిరోధక చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అందుకే వారి సభ్యత్వాన్ని పార్టీ ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. గత శుక్రవారం ఆప్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన సిద్ధాంతాలు, విలువలు, నైతికత నుంచి పక్కకు తప్పిందని ఆరోపిస్తూ రాఘవ్ చడ్డా, అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్త, విక్రమ్ సాహ్ని, స్వాతి మలివాల్ పార్టీని వీడారు. అంతేకాదు ఆ వెంటనే బీజేపీలో చేరారు. బీజేపీలో తాము చేరడాన్ని సమర్థించుకుంటూ రాఘవ్ చడాధ కీలక వ్యాఖ్యలు చేశారు. "రాజ్యాంగం ప్రకారం, ఒక పార్టీలోని మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది సభ్యులు వేరే పార్టీలో చేరితే, అది విలీనం కిందకు వస్తుంది. రాజ్యసభలో ఆప్ పార్టీకి మొత్తం 10 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఏకంగా ఏడుగురు బీజేపీలో చేరారు. కనుక ఇది విలీనం కిందకు వస్తుంది" అని అన్నారు.

**పంజాబ్ ప్రజలను చడ్డా వంచించారు!**

అయితే చడాధ సహా ఆరుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించడంపై ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడ్డారు. ఈ ఫిరాయింపు ప్రజల తీర్పును, ముఖ్యంగా పంజాబ్ ప్రజలను వంచించడమేనని ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఎందుకంటే ఆప్‌ను వీడిన ఏడుగురు ఎంపీలలో ఆరుగురు పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే కావడం గమనార్హం. కాగా, ఈ అంశంపై తాము సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్‌తో సహా పలువురు రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని సంజయ్ సింగ్ అన్నారు. పార్టీ ఫిరాయించిన సదరు ఎంపీలు చట్టం ప్రకారం అనర్హతకు గురవుతారని వాళ్లు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. "ఈ సభ్యులు ఆప్ ద్వారా ఎన్నికై, ఆపై పార్టీని వీడి మరో పార్టీలో చేరారు. ఇది పంజాబ్ ప్రజలకు, భారత రాజ్యాంగానికి చేస్తున్న ద్రోహం" అని సంజయ్ సింగ్ విమర్శించారు.

**ఎంపీలకు నిరసన సెగ**

మరోవైపు పార్టీ వీడిన ఎంపీలకు నిరసన సెగలు తగులుతున్నాయి. జలంధర్‌లోని హర్భజన్ సింగ్ నివాసం వెలుపల ఆప్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. రాజ్యసభలో ఆప్ ఎంపీగా కూడా వ్యవహరించిన ఈ మాజీ క్రికెటర్, ఇటీవల బీజేపీలో చేరారు.

**బీజేపీలోకి ఆప్ ఎమ్మెల్యేలు!**

మరోవైపు పంజాబ్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందన్న ప్రచారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తోసిపుచ్చింది. అందులో ఏ మాత్రం వాస్తవం లేదని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్‌సింగ్ అన్నారు. బీజేపీతోపాటు ఆ పార్టీలో చేరిన ఏడుగురు ఎంపీలు ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. ఇది గందరగోళం సృష్టించటం తప్ప మరొకటి కాదని సంజయ్‌సింగ్ చెప్పారు. "వదంతులు, అసత్య ప్రచారాలు బీజేపీ, రాఘవ్ చడ్డా, ఇతరుల ద్వారా జరిగే అవకాశం ఉంది. మొత్తం పంజాప్‌లో వారిపై వ్యతిరేకత ఉంది. వారికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి నినాదాలు చేస్తున్నారు. పార్టీకి, పంజాబ్‌కు ద్రోహం చేశారని ప్రజలు భావిస్తున్నారు. మరో విషయం ఏమంటే వారి సభ్యత్వం రద్దుకానుంది. అలాంటి వారి వెంట ఏ ఎమ్మెల్యే వెళ్తారు."

**ఆప్ నాయకత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలి!**

పలువురు ఆప్ నేతలు పార్టీ వీడడంపై సామాజిక కార్యకర్త అన్నా హజారే ఇంతకు ముందు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంటుందన్నారు. అయితే నేతలు పార్టీని ఎందుకు వీడుతున్నారో పార్టీ నాయకత్వాలు తప్పక ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆప్ సరైన మార్గంలో నడిచి ఉంటే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడి ఉండేవారు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆప్ ప్రస్తుత దుస్థితికి పార్టీ అధిష్ఠానానిదే పూర్తి బాధ్యత అని హజారే తేల్చిచెప్పారు.

## దీదీ రాజ్యంలో ప్రజాస్వామ్యం ఖూనీ

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌లో ఒక కాంగ్రెస్ కార్యకర్త హత్యకు గురికావడం దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్యం కాదని, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) గూండారాజ్ నడుస్తోందని ఆరోపించారు.

**దారుణ హత్య.. ఆవేదనలో రాహుల్**

అసన్సోల్‌లో కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న దేబ్‌దీప్ ఛటర్జీ అనే కార్యకర్తను పోలింగ్ అనంతరం కొందరు దుండగులు దారుణంగా కొట్టి చంపారు. ఈ ఉదంతంపై 'ఎక్స్' వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. ఇదొక అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ఛటర్జీ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆయన, అధికార టీఎంసీ పార్టీకి చెందిన గూండాలే పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు.

**ప్రజాస్వామ్యం కాదు.. గుండారాజ్**

బెంగాల్‌లో ప్రజాస్వామ్యం కనుమరుగైందని, కేవలం టీఎంసీ గూండాల రాజ్యమే నడుస్తోందని రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓటింగ్ ముగిశాక ప్రత్యర్థుల గొంతు నొక్కడం, దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడమే టీఎంసీ నైజంగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ హింసను ప్రోత్సహించలేదని, తాము రాజ్యాంగబద్ధమైన మార్గంలోనే నడుస్తామని అన్నారు. ఇదే తమ వారసత్వం, సంకల్పం అని ఆయన పేర్కొన్నారు.

**కఠిన శిక్ష పడాల్సిందే**

ఈ హత్యాకాండకు పాల్పడిన దోషులను తక్షణమే అరెస్టు చేసి, అత్యంత కఠినంగా శిక్షించాలని రాహుల్ డిమాండ్ చేశారు. బాధితుని కుటుంబానికి పూర్తి భద్రత కల్పించడంతో పాటు తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. అసన్సోల్ నార్త్ అభ్యర్థి ప్రసేన్‌జిత్ పుటండికి అత్యంత సన్నిహితంగా పనిచేస్తున్న దేబ్‌దీప్‌పై టీఎంసీ అనుబంధ దుండగులే ఈ దారుణ దాడికి పాల్పడ్డారని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. భారతదేశ అహింసా సిద్ధాంతానికి మచ్చ తెస్తున్న ఇటువంటి నీచ రాజకీయాలకు తాము తలొగ్గేది లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## టేకాఫ్ అవుతుండగా స్విస్ విమానంలో మంటలు

ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం త్రుటిలో విమాన ప్రమాదం తప్పింది. టేకాఫ్ అవుతుండగా విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగు ప్రయాణికులు గాయపడ్డారు. ఢిల్లీ విమానాశ్రయం పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో జరిగింది. స్విస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన స్విస్ ఎయిర్ ఫ్లైట్ ఎల్?ఎక్స్?147 ఢిల్లీ ఎయిర్?పోర్ట్? నుంచి స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌కు బయల్దేరడానికి సిద్ధమైంది. టేకాఫ్? అవుతున్న సమయంలో విమానంలో ఎడమ చక్రం వద్ద నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే విమానాన్ని నిలిపివేసి ప్రయాణికులను కిందకు దించేశారు. అత్యవసర స్లైడ్?లను ఉపయోగించి కిందకు దించుకున్న సమయంలో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విమానంలో మొత్తం 232 మంది ప్రయాణికులు ఉన్నారు. తెల్లవారుజామున 2:06 గంటలకు రన్‌వే 28 వద్ద "ఫుల్ హైడ్రాలిక్ ఎమర్జెన్సీ"గా ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందింది. వెంటనే ఐదు ఫైర్ టెండర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చాయి. చివరకు ఉదయం 3:30 ప్రాంతంలో విమానాన్ని సురక్షితంగా నిలిపినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులకు వసతి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే మరో విమానంలో వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విమానాన్ని తనిఖీ చేసి తదుపరి చర్యలు చేపట్టేందుకు స్విస్ సాంకేతిక నిపుణులు ఢిల్లీకి రానున్నారు. ఏప్రిల్ 16న ఢిల్లీ విమానాశ్రయంలో భారీ ప్రమాదం తప్పింది. స్పైస్‌జెట్ విమానం టాక్సింగ్ చేస్తుండగా నిలిచి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని ఢీకొట్టింది. స్పైస్‌జెట్ విమానం గేటు వద్దకు కదులుతున్న సమయంలో హైదరాబాద్‌కు టేకాఫ్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని ఢీకొన్నాయి.

# ప్రజలకు మరింత చేరువగా ప్రజావాణి సేవలు

-మొదటిపేజీ తరువాయి

నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని స్పష్టం చేశారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజా వాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను



అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు.

**ఆలస్యం జరిగితే అధికారులదే బాధ్యత**

ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలన్నారు. ప్రజా వాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.

**ప్రజావాణికి విశేష స్పందన**

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, సత్వర పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అనతి కాలంలోనే దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. తమ సమస్యలను పరిష్కరించాలని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి, అధికారులకు తమ సమస్యలను విన్నవించుకుంటుంటారు. ప్రజావాణి పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొద్ది రోజుల క్రితం తెలిపారు. ఫిర్యాదుదారు తన సమస్య పరిష్కారం ఎంతవరకు వచ్చిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ఏ రకమైన వ్యవస్థ ప్రజావాణిలో ఉన్నదనే అంశంపై ఆయన ఆరా తీశారు. ప్రజావాణి సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడం శుభపరిణామం.

# ప్రతి ఊళ్లో పార్టీ జెండా ఎగురవేయండి

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. రేపు (ఏప్రిల్ 27న) తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు

ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని పార్టీ స్పష్టం చేసింది.

తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుందని, ఆహ్వానం ఉన్న వారు మాత్రమే హాజరుకావాలని, మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉదయాన్నే స్థానిక ప్రాంతాల్లో జెండా పండుగ ముగించుకుని, మధ్యాహ్నం 1:30 గంటల కల్లా హైదరాబాద్ చేరుకోవాలని దూర ప్రాంతాల నుంచి వచ్చే



ప్రతినిధులకు సూచించారు.

**రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు'**

దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గం నుంచి పలువురు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో హుజూర్ నగర్‌లో భారీగా ఓట్లు వచ్చాయి. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారు. హుజూర్‌నగర్‌లో గతంలో ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు మారలేదు. కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. హుజూర్ నగర్ నియోజకవర్గంలో అనామకుడైన సైదిరెడ్డిని గెలిపించాం. 2023 శాసన సభ ఎన్నికల్లో ఓడిపోగానే పార్టీని వదిలిపెట్టి పోయారు. హుజూర్ నగర్‌లో దుర్మార్గమైన కాంగ్రెస్ వైఖరిని బీఆర్ఎస్ శ్రేణులు పోరాట స్ఫూర్తితో ఎదుర్కొంటున్నారు. సైదిరెడ్డి ఆయన సొంత ఊరులో సర్పంచ్‌ని గెలిపించుకోలేక పోయారు. ఆనాడు జలదృశ్యంలో గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరి 25 యేండ్లు పూర్తి చేసుకొని 26 వసంతంలోకి అడుగుపెడుతోంది. దేశంలో ఏ పార్టీకి లేని విశిష్టత ఒక్క బీఆర్ఎస్ పార్టీకే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ఐడెంటిటీ క్రైసిస్ ఉంది.. అందుకే కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి పేరును ఎవరూ గుర్తు పెట్టుకోవడం లేదు. రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. ఒక్కొక్క కాంగ్రెస్ నేత కమల్‌హాసన్‌ను మించి యాక్టింగ్ చేస్తున్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని నమ్మించారు. బాండ్లు పేపర్లు రాసి, దేవుడి మీద ఒట్టు వేశారు. 420హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి?. మాటలు ఆకాశన్నంటాయి.. చేసింది మాత్రం సున్నా.. కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని నల్గొండ రైతులు చెబుతున్నారు'అని తెలిపారు.

# హైదరాబాద్‌లో సొంత ఇల్లా.. అద్దెనా?

జనగణన-- 2027లో భాగంగా కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లోని జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు నేటి (ఆదివారం) నుంచి మే 10 వరకు అవకాశం ఉంది. ఈ గడువులో https:// se. census. gov.in పోర్టల్ ద్వారా ప్రజలు ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు తమ ఇంటి వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. జనగణనకు సంబంధించి సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, 'క్యూర్' పరిధి వరకు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

33 ప్రశ్నలు.. 20 నిమిషాలు

ఇందులో మొత్తం 33 పశ్రలుండగా, నాలుగింటిని ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారు. మిగతావాటికి ప్రజలే సమాధానం ఇవ్వొచ్చు. గుడిసెలు సహా అన్ని నివాస భవనాలను నమోదు చేయడం అధికారుల ప్రధాన విధి. ప్రశ్నలన్నీ ఇల్లు, మౌలిక సదుపాయాలు, వాహనాలు తదితరాలకు సంబంధించినవి. వాటిని కూడా ఉన్నదీ, లేనిదీ తెలియజేస్తే చాలు. అంతే తప్ప ఎన్ని వాహనాలున్నాయో తెలపాల్సిన పనిలేదు. కాకపోతే నివాస గృహం సొంతమా, అద్దెనా అన్నది తెలియజేయాలి. ఇక్కడ అద్దె ఇల్లు అయితే వేరే చోట సొంత ఇల్లు ఉందా అనే విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. ఈ నమోదు ప్రక్రియ మొత్తం దాదాపు 20 నిమిషాల్లో పూర్తవుతుందని వారు తెలిపారు. సబ్మిట్ చేశాక ప్రత్యేక సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్‌ఈ ఐడీ) జారీ అవుతుంది. ఈ ప్రక్రియలో ఆధార్ కానీ, ఇతరత్రా రుజువులు కానీ, ఫొటోలు కానీ అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. కుటుంబ సభ్యులెవరైనా ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయొచ్చు. సురక్షితమైన వెబ్ పోర్టల్ ద్వారా ఇంటి నుంచి కానీ, కార్యాలయం నుంచి కానీ లేదా ఎక్కడి నుంచైనా వివరాలు నమోదు చేయవచ్చు. ప్రస్తుతం ఎక్కడ నివాసం ఉంటున్నారో ఆ ఇంటి వివరాలే ఇవ్వాలని తెలిపారు.

నమోదు విధానం ఇలా..

సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభించడానికి ముందు రాష్ట్రం పేరు, క్యాప్చా వంటివి నమోదు చేయాలి. ఆ తర్వాత కుటుంబ యజమాని పేరు, మొబైల్ నంబర్ ఇవ్వాలి. ఈమెయిల్ ఐడీ కూడా ఇవ్వవచ్చు. కుటుంబ యజమాని పేరు ఒకసారి నమోదు చేసిన తర్వాత మార్చడం కుదరదు.



ఒక మొబైల్ నంబర్‌ను ఒక ఇంటి వివరాల నమోదుకు మాత్రమే వాడాల్సి ఉంటుంది. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేశాక, భాషను ఎంచుకోవచ్చు. 16 భాషల్లో సదుపాయం ఉంటుంది. తర్వాత జిల్లా, పిన్‌కోడ్, లొకాలిటీ, తదితర వివరాలతో తమ ఇంటిని మ్యాప్‌లో గుర్తించాలి. మ్యాప్‌లో కనిపించే మార్కర్‌ను తమ ఇంటిపైకి తీసుకెళ్లి లొకేషన్ కన్‌ఫర్మ్ చేయాల్సి ఉంటుంది. లొకేషన్ సరిగా గుర్తించకపోతే ఎన్యూమరేటర్‌కు డేటా అందకపోవచ్చు. నమోదు చేసిన వివరాలను సరి చూసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒకేసారి కాకపోతే అప్పటి వరకు భర్తీచేసిన వివరాలను సేవ్ చేసుకొని తర్వాత భర్తీ చేసే సదుపాయం కూడా ఉంటుంది. అన్నీ సరిచేసి, నిర్ధారించుకుని సబ్మిట్ చేశాక మార్చడం కుదరదు. సబ్మిట్ తర్వాత మొబైల్ నంబర్‌కు, మెయిల్‌ఐడీ ఇస్తే మెయిల్‌కు కూడా హెచ్ అనే అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్‌ఈ ఐడీ వస్తుంది. దాన్ని ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు చూపిస్తే పరిశీలించి ధ్రువీకరిస్తారు. ఈ డేటా గోప్యంగా ఉంటుందని, ఎవరికీ సమాచారం వెళ్లదని స్పష్టం చేశారు. వివరాలిస్తే ప్రజలు తమకు అందుతున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతాయని భయపడాల్సిన పనిలేదన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రజలకు సదుపాయమే తప్ప, తప్పనిసరి కాదు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోకుంటే , ఎన్యూమరేటర్లే వివరాలు నమోదుచేస్తారు.

**గ్రేటర్‌లో సన్నాహాలు**

గేట్రర్‌లో 60 సర్కిళ్లు, కంటోన్మెంట్‌కు 61 మంది చార్జ్ ఆఫీసర్లను నియమించారు. 19,865 హౌస్‌లిస్టింగ్ బ్లాక్స్‌ను(హెచ్‌ఎల్‌బీ) గుర్తించి మార్కింగ్ పూర్తి చేసినట్లు జీహెచ్ఎంసీ తెలిపింది. 21,866 మంది ఎన్యూమరేటర్లు, 3,662 సూపర్‌వైజర్లు అవసరమని గుర్తించారు. ఇప్పటి వరకు 8,067 ఎన్యూమరేటర్లకు, 1379 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. హెల్ప్‌లైన్ నంబర్: 1855. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు.

**సెల్ఫ్‌ఎన్యూమరేషన్ మహోత్సవ్**

విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జీహెచ్ఎంసీ సెల్ఫ్‌ఎన్యూమరేషన్ మహోత్సవ్ పేరిట 15 రోజులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనుంది. మెట్రో పిల్లర్లు, బస్సులు, హోర్డింగ్స్, ప్రకటనల ద్వారా కూడా పచ్రారం చేయనున్నట్లు కర్ణన్ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## వివరాలు చెబితే పథకాలు రావనే అపోహ వద్దు

-మొదటిపేజీ తరువాయి

జనాభా గణన అవుతుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా చెప్పారు.

**దేశ ప్రణాళికలకు దోహదం**

స్వీయ ధ్రువీకరణలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలను అధికారులు సీఎంకు వివరించగా, ఆన్?లైన్ పోర్టల్ ద్వారా కుటుంబ వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక, ఐ అండ్ పీఆర్? కమిషనర్ సీహెచ్? ప్రియాంక, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జనగణన ప్రజల లెక్కలే కాదు, దేశానికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికల కోసం దోహదం చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 2027లో జనగణనలో మొదటిసారి కులగణన జరుగుతుందన్న ఆయన, అందరూ పాల్గొనాలని సూచించారు. వివరాలు చెబితే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం వద్దని సూచించారు.

**ప్రతి ఒక్కరూ జనగణనలో పాల్గొనాలి**

స్వీయ ధ్రువీకరణలో ప్రజలందరూ పాల్గొనాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అధికారుల సమక్షంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న ఛైర్మన్, వారి కుటుంబ వివరాలు అందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ జనగణనలో పాల్గొనాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. జనగణనలో భాగంగా హైదరాబాద్ రామ్‌నగర్‌లోని ఆయన నివాసానికి వచ్చిన జనగణన సిబ్బందికి తమ పూర్తి వివరాలను అందించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రజలందరూ పాల్గొనాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జీహెచ్?ఎంసీ అధికారుల సమక్షంలో స్వీయ ధ్రువీకరణ చేసుకున్న మంత్రి, అపోహలకు పోకుండా జనగణనలో అందరూ పాల్గొనాలని కోరారు. "దేశవ్యాప్తంగా జాతీయ జనగణన ప్రారంభమైంది. ఈ కార్యక్రమం తెలంగాణలో ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పౌరుడు సెల్ఫ్? ఎమ్యునరేషన్ చేయడం ద్వారా తమ కుటుంబ వివరాలను దేశ జనాభా లెక్కల్లో చూపించాలని కోరుతున్నాం. జనగణనలో తెలంగాణను దేశంలోనే పారదర్శకంగా నిర్వహించిన రాష్ట్రంగా నిలిచేలా ప్రతి పౌరుడూ దీనిని చేయాలని కోరుతున్నాను" – పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ మంత్రి

**స్వీయ గణన నమోదుపై అవగాహన**

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణన–2027లో కులగణన చేపడుతున్నా, అందులో బీసీల సంఖ్యను గుర్తించే అవకాశం లేదని, అందుకు మరో కాలమ్‌ను చేర్చాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలమ్ తర్వాత బీసీల కోసం 34వ కాలమ్ చేర్చాలని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబ్‌నగర్‌లో "హ్యాపీ సండే" కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. జనాభా గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాప్ ద్వారా గణన వివరాలను నమోదు చేశారు. ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించడం ద్వారా పారదర్శకత ఉంటుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. తాను కూడా జనగణన పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. స్వీయ గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి యువతకు పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి స్వీయ గణన నమోదుపై అవగాహన వీడియోను కలెక్టర్ ప్రదర్శించారు.

## నిరీక్షణకు తెర

అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకమయ్యారు. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంత్రి అజారుద్దీన్, కోదండరాంల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు ఇటీవల లైన్ క్లియర్ అయింది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలపై నేడు గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై వివాదం కొనసాగుతోంది. అయితే ఈ నెల 30లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్? మంత్రి పదవి కోల్పోయేవారు.

## ఉపాధ్యాయ బదిలీలపై అయోమయం!

-మొదటిపేజీ తరువాయి

ఒకవేళ జూన్ 9 తర్వాత బదిలీలు చేస్తే మరో మండలానికి, దూర ప్రాంతాలకు వెళ్లిపోవచ్చు. నిబంధనల ప్రకారం ఇళ్ల గణాంకాల్లో పాల్గొన్న వారే 2027 ఫిబ్రవరి1 నుంచి మార్చి వరకు నిర్వహించే తుది విడత జనగణన(వ్యక్తిగత వివరాల సేకరణ) చేయాల్సి ఉంటుంది. దాంతో టీచర్ల బదిలీలు చేస్తే ఇబ్బంది తలెత్తుతుందని సంబంధిత విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

**త్వరలో తుది నిర్ణయం**

రాష్ట్ర ప్రభుత్వం మే 1–31 మధ్యలో బదిలీలు జరుపుకొనేందుకు జీవో(ఉత్తర్వులు) జారీ చేసింది. ఒక పాఠశాలలో కనీసం రెండు సంవత్సరాల పాటు పనిచేస్తేనే ఉపాధ్యాయులు బదిలీ కోరవచ్చు. ఒకవేళ ఎనిమిదేళ్లు పూర్తయినట్లయితే మాత్రం తప్పనిసరిగా ట్రాన్స్ఫర్? కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2018 జులైలో టీచర్ల బదిలీలు జరిగినందున 2026 జులై 14వ తేదీకి ఎనిమిదేళ్లు పూర్తవుతుంది. అంటే వారంతా తప్పనిసరి బదిలీ కిందకు వస్తారు. 2024 జూన్‌లో స్థానచలనం అయిన వారు ఆసక్తి ఉంటే ట్రాన్స్ఫర్ ప్రక్రియలో పాల్గొనవచ్చు. ఎక్కువ మంది ప్రయోజనం పొందాలంటే జులైలో బదిలీలతో పాటు ప్రమోషన్లను కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఐకాస నేతలు దామోదర్‌రెడ్డి, చావ రవి, సదానందంగౌడ్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వానికి సంయుక్తంగా వినతిపత్రం అందజేశారు. జులై నాటికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రిజల్ట్స్? కూడా విడుదలయ్యే అవకాశం ఉన్నందున జులై 31ని కటాఫ్ తేదీగా నిర్ణయించి బదిలీలు, పదోన్నతులకు అనుమతి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 2011లో జనగణన జరిపినప్పుడు తుది విడతలో కొత్తవారే పాల్గొన్నారని, ఆనాడు తొలి విడత తర్వాత బదిలీలు జరిగాయని నేతలు గుర్తుచేస్తున్నారు.

**బదిలీలపై నిర్ణయం అప్పుడే**

పాఠశాల విద్యాశాఖ అధికారులు మాత్రం ఎప్పుడు బదిలీలు జరపాలని కాకుండా రాష్ట్రంలో గతంలో ఎప్పుడు బదిలీలు చేశారు? ఎప్పుడు పదోన్నతులిచ్చారు? మే నెలలో అయితే ఎంత మందికి ప్రయోజనం చేకూరుతుంది? తదితర వివరాలను మాత్రమే ప్రభుత్వానికి అందజేసినట్లుగా సమాచారం. మరో వైపు ప్రస్తుతం అధిక హెచ్‌ఆర్‌ఏ స్థానాల్లో ఉన్న వారు బదిలీలు కోరుకోరని, జనగణన ముగిసే వరకు ఎలా బదిలీలు చేస్తారని న్యాయస్థానాల్లో పిటిషన్ దాఖలు చేసేటువంటి అవకాశం కూడా లేకపోలేదని కొంతమంది టీచర్లే అనుమానం వ్యక్తంచేస్తున్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఫిన్లాండ్ పర్యటన నుంచి వచ్చిన అనంతరం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై దృష్టి సారించండి.. తక్షణమే తగిన చర్యలు తీసుకోండి..!

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొనడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన కొరతను వెంటనే నివారించాల్సిందిగా భారత్,



హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్స్ ఉన్నతాధికారులను పెట్రోలియం పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు, ఎంపీ రవిచంద్ర కోరారు. హైదరాబాద్ నుంచి హన్మకొండకు ఆదివారం వెళ్తుండగా తాను పలు చోట్ల వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి ఉండడాన్ని గమనించానని ఫోన్ చేసి అధికారులకు వివరించారు ఎంపీ. పెట్రోల్, డీజిల్ కొరతను వెంటనే అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరడంతో సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారు

## సంపాదకీయం

# ‘డిజిటల్’ కేసులో పరిహారం!

జేబులు కొట్టడం, దారి దోపిడీలు చేయడం, దొంగతనాలకు పాల్పడటం, నమ్మించి మోసగించటం... ఇవన్నీ పాతకాలపు నాటు పద్ధతులు. 2016లో పెద్దనోట్ల రద్దుతర్వాత దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులు మొదలై వీటన్నిటినీ మరపించేలా కొత్త కొత్తదోపిడీ విధానాలు రంగప్రవేశం చేస్తున్నాయి. అందులో తాజాగా వచ్చిచేరిన ‘డిజిటల్ అరెస్టు’ వీటన్నిటినీ తలదన్నింది. ఈ మార్గాల్లో పౌరులు కోల్పోతున్న సొమ్ము వందల్లోంచి వేలల్లోకి... అక్కడి నుంచి లక్షలు దాటి ఇప్పుడు కోట్లాది రూపాయలకుచేరటంతో మన వ్యవస్థల్లో చలనం వచ్చినట్టుంది. అందుకే కావొచ్చు... ఇటీవల రిజర్వ్ బ్యాంకు స్వతంత్ర ప్రతినిధి (అంబుడ్స్‌మన్) ఈ తరహాలో రూ. 22.93 కోట్లు పోగొట్టుకున్న నరేష్‌చంద్ర అనే బాధితుడికి కోటీ 31 లక్షల పరిహారం చెల్లించాలని అయిదు బ్యాంకుల్ని ఆదేశించింది. ఆన్‌లైన్ లావాదేవీల్లో లక్షలాది రూపాయలు నష్టపోతున్న బాధితులు తమ మూర్ఖత్వాన్నీ, తెలివితక్కువతనాన్నీ తిట్టుకుని రోదిస్తు న్నారు. ‘డిజిటల్ అరెస్టు’లో రూ. 8 కోట్లు కోల్పోయిన ఉదంతంలో పంజాబ్ మాజీ ఐజీ అమర్‌సింగ్ చాహల్ ఆత్మహత్యాయత్నం చేశారు. ఫిర్యాదులిచ్చినా తిరిగి రాబట్టుకునే సొమ్ము అంతంతమాత్రంగానే ఉంటున్నది. సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేయ టానికి వెళ్తే ‘ఆ మాత్రం తెలియదా?’ అంటూ ఎదురయ్యే చీవాట్లను భరించటంఅదనపు కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో అంబుడ్స్‌మన్ నిర్ణయం బాధితులకు ఉపశమనంకలిగిస్తుంది. ఈ మోసాలు పౌరులకు పెద్ద తలనొప్పిగా మారాయి. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే ‘మన్ కీ బాత్’లో ‘డిజిటల్ అరెస్టు’ మోసాల గురించి ప్రస్తావించాక, మీడియాలో రిజర్వ్ బ్యాంకు తరఫున భారీ ప్రకటనలివ్వటం మొదలైనాక జనంలో ఏదోమేరకు చైతన్యం వచ్చిన సంగతి వాస్తవమే. అయితే ఇంకా మోసపోయేవారిసంఖ్య తగ్గటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మోసాల కారణంగా జనం రూ. 34,771 కోట్లు కోల్పోయారని రిజర్వ్ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కేవలం ‘డిజిటల్ అరెస్టు’ల వాటాయే రూ. 1,900 కోట్లు ఉంది. 2022లో 10.29లక్షలున్న కేసులు 2024 నాటికి 22.68 లక్షలకు చేరాయి. గత మూడేళ్లలో జనం నుంచి మాయగాళ్లు కొట్టేసిన సొమ్ము 1.25 లక్షల కోట్లు! సిబ్బంది కొరత మాటెలావున్నా, పోలీసు విభాగాల్లో సైబర్ నేరాల దర్యాప్తు, ఆచూకీ రాబట్టడం వగైరాల్లో చాలామందికి పకడ్బందీ శిక్షణ లేదు. ఈ మాదిరి నేరాలకు పాల్పడేవారు వేరే రాష్ట్రాలకూ, వేరే దేశాలకూచెందినవారు కావటం, దర్యాప్తు చేయటానికి పెద్ద ఆటంకంగా మారింది. నియంత్రణ వ్యవస్థలు ఈ మోసాలను అరికట్టడానికి కొత్త ఉపకరణాలు కనుక్కొనే లోగానే నేరగాళ్లు ఏఐతో, ఇతరేతర మార్గాల్లో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. 2000 సంవత్సరంలో వచ్చిన ఐటీ చట్టం, 2023 నాటి డేటా పరిరక్షణ చట్టం వంటివి మధ్యస్తంగా ఉండే సంస్థలపై బాధ్యత మోపాయి. కానీ ఆచరణలో పెద్దగా ప్రయోజనం లేదు. అంబుడ్స్‌మన్ నిర్ణయం ఈ నేరాలను అరికట్టడంలో ముందడుగు. అసలు ఖాతాదార్లకు తెలియకుండా దొంగసొమ్ము రాకపోకలకు నేరగాళు వాడుకునే ‘మ్యూల్ అకౌంట్‌ల’ పనిబట్టేందుకు ఇటీవల ప్రయత్నాలు మొదలయ్యాయి. బ్యాంకుల నిష్క్రియాపరత్వం కావొచ్చు... సిబ్బంది కుమ్మక్కుకావటం వల్ల కావొచ్చు ఇవిఇన్నాళ్లూ నిర్నిరోధంగా సాగిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో నేరగాళ్లకు సహకరించేబ్యాంకు సిబ్బందిని పోలీసులు ఈమధ్యే అరెస్టు చేశారు. ఈ మార్గంలోనే అంబుడ్స్‌మన్ సైతం ఖాతాదారు వివరాలు సేకరించటానికి, ద్రవ్య అక్రమ చలామణిని అరికట్టడానికి ఉన్న నిబంధనల్ని పాటించటంలో అలసత్వం ప్రదర్శించినందుకు నరేష్‌చంద్ర కేసులో పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అయితే దీంతో ఆయన సంతృప్తిపడదల్చుకోలేదు. రిజర్వ్‌బ్యాంకు మార్గదర్శకాలు పాటించని ఆ బ్యాంకులనుంచి తాను కోల్పోయిన మొత్తం రూ. 22.93 కోట్లు ఇవ్వటంతోపాటు నష్టపరిహారం, వడ్డీ, క్యాపిటల్ గెయిన్స్ పన్నుకయ్యే ఖర్చుతో సహా వెనక్కి ఇప్పించాలని నరేష్‌చంద్ర పోరాడతానంటున్నారు. ఆన్‌లైన్ మోసాల్లో బాధితులుగా మారుతున్నవారు పోలీసు కేసులు పెట్టడంతోపాటు, బ్యాంకుల అలసత్వం ఉన్నపక్షంలో వాటిపై కూడా న్యాయపోరాటం చేయటానికినరేష్‌చంద్ర కేసు స్ఫూర్తిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.

# చరిత్రను సృష్టించిన మహానాయకుడు కేసీఆర్

చరిత్రను సృష్టించిన మహానాయకుడు కేసీఆర్. ఆ చరిత్రను మలినం చేయాలని, కేసీఆర్ ప్రతిభను తగ్గించాలని చూసిన చరిత్రహీనులు విఫలమయ్యారు. ఒక ప్రజాశక్తితో ఎదిగిన నాయకుడు కేసీఆర్. కేసీఆర్ పరపతిని తగ్గించాలనుకోవడం ప్రత్యర్థులకు ఒక చిలిపి వికృతక్రీడ మాత్రమే. కేసీఆర్ రాజకీయ ప్రయాణం ఒక సాధారణ రాజకీయం లెక్క కాదు. తెలంగాణ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా ఉన్న కాలంలో.. ‘తెలంగాణ రాష్ట్రం రావాలి’ అని స్పష్టంగా, ధైర్యంగా చెప్పిన అరుదైన నాయకుడు. ప్రజలను చైతన్యపరిచారు. ఉద్యమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లారు. సకల జనులను ముందుండి నడిపించారు. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతానికి రాజకీయ అస్తిత్వాన్ని సాధించారు. రాష్ట్రాన్ని సాధించి, ఉద్యమ నాయకుడే పాలకుడిగా మారిన అరుదైన ఉదాహరణగా నిలిచారు. రాష్ట్రావతరణ తర్వాత కూడా తెలంగాణ ఆత్మను పాలనలో ప్రతిబింబించేందుకు పాటుపడ్డారు. నీటి ప్రాజెక్టులు, సాగు విస్తరణ, రైతు సంక్షేమం, సంక్షేమ, అభివృద్ధి పథకాలెన్నో. ప్రజల అవసరాల నుంచి పుట్టిన విధానాలే.

బీఆర్ఎస్ పాలనలో (2014-2023) తెలంగాణ రాష్ట్రం ఆర్థిక, వ్యవసాయ, సాగునీరు, సాంకేతిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల కాలంలో జరిగిన ప్రధాన అభివృద్ధి పనులు, సాధించిన విజయాలు చరిత్రలో సుస్థిరంగా నిలిచే ఉంటాయి. హైదరాబాద్ నడిమధ్యన కేసీఆర్ నిర్మించిన అత్యంత విశాలమైన సచివాలయ భవనంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారంటే ఆయనకు కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదు. అంతే కాకుండా కేసీఆర్ పాలనలో సాధించిన ప్రగతి ఫలాలను కాంగ్రెస్ సర్కార్ అనుభవిస్తూ తమ పాలనలోనే అభివృద్ధి జరిగిందని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నది.

తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం 2014-15లో రూ.1,24,104 ఉండగా, 2023-24 నాటికి రూ.3,47,714కు పెరిగింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.5.05 లక్షల కోట్ల నుంచి రూ.14.61 లక్షల కోట్లకు పెంచిన చరిత్ర బీఆర్ఎస్‌దే. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో ఐటీ ఎగుమతులు రూ.56,000 కోట్ల నుంచి రూ.2.41 లక్షల కోట్లకు చేరాయి. ఐటీ ఉద్యోగాలు 3.23 లక్షల నుంచి 10 లక్షలకు పైగా పెరిగాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలు హైదరాబాద్‌లో తమ అతిపెద్ద క్యాంపస్‌లను కేసీఆర్ పాలనలోనే ఏర్పాటు చేయడం విశేషం. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పరిగణించే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన అపరభగీరథుడు కేసీఆర్ రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు దేశంలోనే మొదటిసారిగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రెడు పంటలకు కలిపి ఎకరాకు రూ.10,000 చొప్పున వేలాది కోట్ల రూపాయలను రైతులకు కేసీఆర్ అందజేశారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రూ.5 లక్షల ఉచిత రైతు బీమా సౌకర్యం కల్పించిన ఆపద్బాంధవుడు కేసీఆర్.

ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం కేసీఆర్ ఘనతనే. మిషన్ భగీరథ కింద రాష్ట్రంలోని కోటి గృహాలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యం పూర్తి చేసిన మానవీయ పాలకుడు కేసీఆర్. మిషన్ కాకతీయలో భాగంగా చిన్న తరహా నీటిపారుదలలో చెరువులను పునరుద్ధరించడం ద్వారా భూగర్భ జలాలను పెంచారు. కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్ పథకం కింద నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం కోసం ఆర్థిక సాయం అందించారు. ఆరోగ్య రంగంలో బస్తీ దవాఖానాలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలతో సేవలను ప్రజలకు చేరువ చేశారు. 24 గంటల కరెంటు సరఫరాతో వ్యవసాయానికి, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తు




టీ-హబ్ : హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ఒక వెనుకబడిన రాష్ట్రం నుంచి దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు సాధించిన రాష్ట్రంగా ఎదిగిందని ఈ గణాంకాలు చెప్తున్నాయి. కేసీఆర్ అనే మూడు అక్షరాలు జై తెలంగాణ యుద్ధ నినాదం, దశాబ్దాల ఆకాంక్షల ప్రతిధ్వని, తెలంగాణ ఆత్మగౌరవ గర్జన. కేసీఆర్ అంటే.. ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం, తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్య సూర్యోదయం. ఉద్యమంలో, పాలనలో సాధించిన ఫలితాలే నిదర్శనం.

కేసీఆర్ ఒక ఉద్యమం, ఒక విజన్, యుగ ప్రభంజనం. ఆయన పాలన ఒక చరిత్ర. రాజకీయాలు ఉన్నంతవరకు కేసీఆర్ పాలన చరిత్ర ఎప్పటికీ నిలిచే ఉంటుంది. తెలంగాణ ప్రజల హృదయాల్లో కేసీఆర్ ఉంటారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనను చెరిపివేయడమనేది ఎవరికీ సాధ్యం కాదు. యావత్తు తెలంగాణను ఏక తాటిపై నడిపి, ఉద్యమం నడిపించి, ఆ ఉద్యమాన్ని రాష్ట్ర ఆవిర్భావంగా తీర్చిదిద్దిన దృఢసంకల్పం. ఆయన అడుగులు ఆత్మగౌరవ పోరాటానికి దారులు చూపాయి. ఆయన ఆలోచనలు అణగారిన గుండెలకు ఆత్మబలాన్ని అందించాయి. కేసీఆర్ వ్యూహాలు ఆధిపత్య శక్తుల కుట్రల్ని పటాపంచలు చేశాయి. పోరాట పట్టుదల, పరిణతి, నిబద్ధత, నిర్భీతి తరతరాల వివక్షా విద్రోహాల నుంచి తెలంగాణను విముక్తి చేశాయి.

ప్రతి తరానికి ఒక టార్చ్‌బేరర్ ఉంటారు. తెలంగాణకు టార్చ్‌బేరర్ కేసీఆరే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అవుతున్నది. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే పాలనను గాలికొదిలేసి రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై ఎలా కక్ష తీర్చుకోవాలనే దృష్టితోనే రేవంత్‌రెడ్డి ఉన్నారు. అంతేతప్ప ఆరు గ్యారెంటీలను అమలు చేయాలనే ఆలోచన చేయడంలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు చేసిన రేవంత్ సర్కార్‌కు ఇటీవలి హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిది. రేవంత్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడం మినహా పాలనలో సాధించినది జీరో అనే చెప్పాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై అక్రమ కేసులు బనాయించిన కాంగ్రెస్ సర్కార్ పైశాచిక ఆనందం పొందుతున్నది. పదేండ్ల పాలనలో కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు తప్ప రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన సంక్షేమం శూన్యం. కాంగ్రెస్ పాలనలో ఏడాదిలోనే రాష్ట్ర రాజకీయం గిర్రున తిరిగింది. రెండున్నరేండ్లు కావొస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతిపక్షం బలాన్ని పెంచుకుంటుంటే, అధికార పార్టీ ప్రజావ్యతిరేకతను, ప్రజాగ్రహాన్ని మూట గట్టుకుంటున్నది. రేవంత్ సర్కార్ ఇబ్బందులు పెట్టాలని ఎ న్ని చిల్లర పనులు చేస్తున్నా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొంటున్న నిప్పులాంటి మనిషి కేసీఆర్.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసే విమర్శల భాష జుగుప్సాకరం. రేవంత్ విమర్శలను చూసి తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటున్నది. మైకు దొరికితే చాలు.. ‘పండబెట్టి తొక్కుతా.. చీరుతా.. చింపుతా.. సంపుతా.. గుడ్లు పీకి గోటీలాడుతా.. యాప శెట్టుకు కట్టేసి లాగుల తొండలిడుస్తా..’ అంటూ తీవ్రమైన పదజాలంతో రేవంత్‌రెడ్డి చెలరేగిపోవడాన్ని తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు దిగజారి ‘బుల్డోజర్‌తో తొక్కిస్తం.. మానవ బాంబులై చంపేస్తం..’ అని హింసాత్మక ధోరణిలో మాట్లాడుతూ రెచ్చగొడుతున్నారు. కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు తీవ్రంగా తప్పు పడుతున్నారు.. ‘నా కొడకల్లారా.. ఒక్కొక్కన్ని పండబెట్టి తొక్కి పేగులు తీసి మెడలేసుకొని ఊరేగుతా’ అని ముఖ్యనేతనే ఉన్మాదిలా మాట్లాడడం సిగ్గుచేటు. రాజకీయ పరిభాషను దిగజార్చడంలో రేవంత్‌రెడ్డి రోజురోజుకకు దిగజారి ప్రవర్తిస్తున్నారు. బాధ్యతగల ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తన కంటే వయస్సులో పెద్ద అయిన కేసీఆర్ కీడును కోరుకుంటూ మాట్లాడుతున్నారంటే కాంగ్రెస్ పాలనలో రాజకీయాలు ఎంత నీచస్థాయికి దిగజారిపోయాయో స్పష్టమవుతున్నది.

పవర్‌ఫుల్ వెపన్ మౌత్‌టాక్. దాన్ని నిలువరించడం ఎవ్వరి వల్ల కాదు. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి సొంత నియోజకవర్గం మల్కాజ్‌గిరి ఎంపీని కోల్పోవడంతో మొదలైన కాంగ్రెస్ పతనం పంచాయితీలు, మున్సిపల్ ఎన్నికల్లో తారా స్థాయికి చేరింది. అటు సొంత పార్టీలో, సొంత ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డిపై అంతర్గత వ్యతిరేకత పెరిగింది. హైదరాబాద్‌లో హైడ్రా ఆగడాలు, ఖమ్మంలో పేదల ఇండ్ల కూల్చివేతలతో వ్యతిరేకత ఇంకా ఎక్కువయింది.

రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో కాంగ్రెస్‌పై అసంతృప్తి కట్టలు తెంచుకొన్నది. ధర్నాలు, రాస్తారోకోలు, సమ్మెలు, నిరవధిక నిరాహార దీక్షలతో తెలంగాణ మొత్తం అట్టుడుకుతున్నది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు పెరుగుతున్నాయి. సంఘటిత, అసంఘటిత కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన బాట పడుతున్నారు. రాస్తారోకోలు, చలో సెక్రటేరియట్, చలో బస్‌భవన్, చలో విద్యుత్తు సౌధ, చలో విద్యశాఖ అంటూ రాష్ట్రంలో అన్ని ప్రధాన శాఖల ఆఫీసులను ప్రజలు, ఉద్యోగులు ముట్టడిస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో నరకం చూస్తున్న ప్రజలు.. కేసీఆర్ పాలన గొప్పదనాన్ని తలుచుకుంటున్నారు. విశ్వసనీయ, ప్రేరణకు మారు పేరైన ప్రియతమ నేత కేసీఆర్ మళ్లీ పాలన పగ్గాలు చేపట్టాలని కోరుతున్నారు.

# సహకార సంఘాల నిర్వీర్యం తగదు

రాష్ట్రంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) ఇప్పుడు రాజకీయ చదరంగంలో పావులుగా మారాయి. గడువు ముగిసిన సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సింది పోయి, నామినేటెడ్ పద్ధతిలో కమిటీలను వేయాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చకు దారితీస్తున్నది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు రాజకీయ సమీకరణాలు అనుకూలంగా లేవు. దీంతో హస్తం పార్టీ పాలకుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. రైతుభరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం, అన్ని పంటలకు క్వింటాల్‌కు బోనస్ 500 చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే చెల్లిస్తామని చెప్పడం ఇందుకు ప్రధాన కారణాలు. అది కూడా ఒక్క పంటకు చెల్లిస్తే మరో పంటకు ఎగనామం పెట్టింది కాంగ్రెస్ సర్కార్. దీనితో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్నది. కాంగ్రెస్ సర్కార్ స్థానిక ఎన్నికలపై దాటవేత ధోరణి అనుసరిస్తున్నది. ప్రస్తుతం ప్రజాగ్రహం పెల్లుబుకుతున్న నేపథ్యంలో ఎన్నికలకు వెళ్తే, ఫలితాలు ప్రతికూలంగా వస్తాయని జంకుతున్నది. రైతుల ఆగ్రహం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై పడుతుందని కాంగ్రెస్ వర్గాలే చెప్తున్నాయి. ప్రజల్లో వ్యతిరేకత అలా ఉంటే, అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లయినా పదవులు దక్కలేదని ద్వితీయ శ్రేణి నాయకులు ఆగ్రహంగా ఉన్నారు. కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. వారికి తక్షణమే ‘రాజకీయ ఉపాధి’ కల్పించడమే లక్ష్యంగా ఈ నామినేటెడ్ ఎత్తుగడ వేసినట్టు తెలుస్తున్నది. సహకార రంగం అనేది ‘రైతుల కోసం, రైతుల ద్వారా’ నడవాల్సిన వ్యవస్థ. 97వ రాజ్యాంగ సవరణ ప్రకారం సహకార సంఘాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. అయితే రైతులు తమ ప్రతినిధులను తామే ఎన్నుకొనే అవకాశాన్ని ప్రభుత్వం లాగేసుకుంటున్నది. కేవలం అధికార




పార్టీకి చెందిన నాయకులను, అనుచరులను ఈ కమిటీల్లో కూర్చోబెట్టడం ద్వారా సహకార సంఘాల నిధులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొనే ప్రమాదమున్నదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గతంలోనూ సమైక్య రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగినప్పుడు కోర్టులు జోక్యం చేసుకొన్న దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ అదే పునరావృతమయ్యేలా కనిపిస్తున్నది. ప్రతిపక్షాలు ఈ నిర్ణయంపై భగ్గుమంటున్నాయి. ‘ఎన్నికలను ఎదుర్కొనే దమ్ము లేకనే దొడ్డిదారిన పదవులను పంచుకుంటున్నారు’ అని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరిగితే, అర్హులైన రైతులకు అందాల్సిన రుణాలు, సబ్సిడీలు కేవలం అధికార పార్టీ సానుభూతిపరులకే దక్కే ప్రమాదం ఉన్నది. ఈ ధోరణి వ్యవస్థను నిర్వీర్యం చేసే అవకాశం ఉన్నది. సహకార రంగాన్ని బలోపేతం చేయాలంటే పారదర్శకమైన ఎన్నికలే ఏకైక మార్గం. అలా కాకుండా కేవలం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వేదికలుగా వీటిని మారిస్తే, అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కోలుకోలేని దెబ్బ తీస్తుంది. మరి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకుంటుందా లేక మొండిగానే ముందుకు వెళుతుందా అనేది వేచి చూడాలి.

# స్వీయ గణన అవకాశాన్ని వినియోగించుకోండి






**రామగుండంలో జనగణన కార్యక్రమానికి శ్రీకారం**

అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):

స్వీయ గణన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జనాభా లెక్కల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సుబ్బరాజుతో కలిసి స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ రామగుండంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ స్థానిక జనాభా లెక్కల్లోనే నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చే పదేళ్ల అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపులు, సంక్షేమ కార్యక్రమాలు ఈ లెక్కల ఆధారంగానే అమలవుతాయని తెలిపారు. జాయింట్ డైరెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ జనాభా లెక్కల్లో సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందన్నారు. ఆధార్ ఎక్కడ ఉన్నా నివాసం ఉన్న చోటే నమోదు చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్

మాట్లాడుతూ https://se.census.gov.in?? వెబ్‌సైట్ ద్వారా స్మార్ట్‌ఫోన్ సహాయంతో స్వీయ గణన చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ఈ అవకాశం ఉంటుందని, మే 11 నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా స్వీయ గణన పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలని కవిత ముస్తాఫా, వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, చిదురాల నాగరాజు, నాయకులు చుక్కల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, వేగోలపు శ్రీనివాస్, అధికారులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, నవీన్, పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కర్మాగారం బాధితులకు డబ్బులు ఇప్పించాలి

**ఎమ్మెల్యే మాట తప్పొద్దు**
**: వ్యాల్ల హరీష్ రెడ్డి**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్‌సీఎల్)లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసిన దళారుల నుంచి బాధితులకు సొమ్ము ఇప్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లుగా సమస్యను పరిష్కరిస్తామని చెప్పి మాట దాటవేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ వెంటనే స్పందించాలని కోరారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్ఎఫ్‌సీఎల్ బాధితుల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన రాజ్ ఠాకూర్ ఇప్పుడు వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. దళారులను జైలుకు పంపించి బాధితులకు డబ్బులు ఇప్పిస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు వస్తాయని నమ్మి పలువురు బాధితులు భూములు, స్థలాలు అమ్మి, కుటుంబ సభ్యుల నగలు తాకట్టు పెట్టి దళారులకు డబ్బులు ఇచ్చారని గుర్తు చేశారు. బాధితుల డబ్బులతో గోదావరి ఒడ్డున 18 ఎకరాల భూమి కొనుగోలు జరిగిందని, దానికి లేఅవుట్ అనుమతులు కూడా ఇప్పించారని ఆరోపించారు. బాధితులకు డబ్బులు ఇప్పించకుండా అలాంటి పనులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.




ఈ అంశంలో ప్రభుత్వం, ఎమ్మెల్యేను వదిలిపెట్టేది లేదన్నారు. అవసరమైతే బాధితులతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులను కలుస్తామని తెలిపారు. ఇంకా స్పందించకపోతే గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట టెంట్ వేసుకుని నిరసన చేపడతామని హెచ్చరించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పటికి బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# వివిధ శుభకార్యాలలో పాల్గొన్న వధూవరులను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి





అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి నియోజకవర్గశీ లోని వివిధ శుభకార్యాలలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కల్వకుర్తి మండలం లోని తాంద్ర గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొట్టే వెంకటయ్య యాదవ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు,అనంతరం కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయితపాగా సంతోష్ కుమారుల పుట్టు పంచెల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు, అనంతరం వెల్దండ మండలం రావిచెట్టు బావి తండాలో చి.పవన్ నాయక్ వివాహా వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ రమేష్ నాయక్, పత్య నాయక్,మాజీ సర్పంచ్ లు పంతుల నాయక్,నరేందర్ గౌడ్,వార్డు సభ్యులు హరీష్ ,చంద్ర శేఖర్,సీనియర్ నాయకులు కొండల్ యాదవ్, గణేష్, శేఖర్,మల్లయ్య,సందీప్,నందు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ మాత అహింస, ధర్మ రక్షణకు ప్రతీక



**జయంతి వేడుకల్లో మేయర్ మహంకాళి స్వామి**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

అహింస, శాంతి, ధర్మ రక్షణకు శ్రీ వాసవీ మాత ప్రతీక అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శ్రీ వాసవీ మాత జయంతిని పురస్కరించుకొని ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని తెలంగాణ ప్రభుత్వం 2026 నుంచి అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. స్త్రీల ఆత్మగౌరవం, ధర్మ పరిరక్షణ కోసం వాసవీ మాత చేసిన త్యాగాన్ని గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాసవీ మాత ఆశీస్సులతో నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిదురాల నాగరాజు, వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, వేగోలపు శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, బొంతల రాజేష్, అధికారులు శ్రీహరి, నవీన్, పబ్బాల శ్రీనివాస్, తేజస్విని, సౌమ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాహితి వివాహానికి దాతల అండ



అగ్నిధార న్యూస్,(రామగుండం):

గోదావరిఖని వినోబా నగర్‌కు చెందిన సాహితి వివాహానికి పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. ఆలయ ఫౌండేషన్ సభ్యులు ఐత శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం రూ.31,125 సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ నరహరి ఐఏఎస్ మార్గదర్శకత్వంలో దాతలు మానవత్వంతో స్పందించారని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ గోడిశెల పుష్ప పాల్గొని సహాయం అందజేశారు. ఇలాంటి ఆడపిల్లలను ఆదుకోవడం సమాజ బాధ్యత అని, ఇంకా దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో పలువురు దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

## జిడికే 11వ ఇంక్లైన్‌లో మూడో చైర్‌లిఫ్ట్ ప్రారంభించాలి



**కార్మిక సమస్యలపై మేనేజర్‌తో ఏఐటీయూసీ నాయకుల చర్చ**

అగ్నిధార న్యూస్, ( రామగుండం):

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జిడికే 11వ ఇంక్లైన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు గని మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం మేనేజర్‌తో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గనిలో గాలి, నీటి సరఫరా సరిగా లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన వెంటిలేషన్ లేకుండానే విధులు నిర్వహించాలంటూ యాజమాన్యం ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకొని గాలి, నీరు, వెలుతురు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు అవసరమైన పనిముట్లు పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదని, వాటిని అందించాలని కోరారు. విధులకు వెళ్లే కార్మికులకు చైర్ కార్లు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో మూడో చైర్‌లిఫ్ట్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన గని మేనేజర్ వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి జీఎం కమిటీ సభ్యులు సిద్ధమల్ల రాజు, ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశల నరేష్‌తో పాటు మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్

**లోక కల్యాణార్థం గోదావరిఖనిలో వైభవంగా చండీహోమం**

**కోల్** : అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు పేర్కొన్నారు. గోదావరిఖని జవహర్ నగర్ లో గల శ్రీశ్రీశ్రీ జయదుర్గా దేవి ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో లోక కల్యాణార్థం ప్రత్యేక చండీహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

# శ్రీ శ్రీ శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలు చాల్లంగా ఉండాలి



**విగ్రహా ప్రతిష్ట పనలో పాల్గొన్న బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడ్గుల మండల కేంద్రంలోని సురమాంబదేవి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మల గౌడ కుల దేవతల విగ్రహా ప్రతిష్ట మరియు కళ్యాణ మహోత్సవం అపూర్వమైన ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించబడింది. ఈ అయిదు రోజులపాటు జరిగిన మహోత్సవం భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని మరింతగా పెంపొందించి, గ్రామమంతా పుణ్యక్షేత్రంగా మారింది. ఈ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు మన సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తాయని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గౌడ కుల దేవతల పూజలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని, వాటిని భక్తి శ్రద్ధలతో కొనసాగించడం మన బాధ్యత అని అన్నారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. అన్నదాన కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మహోత్సవానికి మరింత ప్రత్యేకతను చేకూర్చాయి. దూరదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు కూడా ఈ పుణ్యకార్యక్రమంలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. దేవత ల దయతో గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రతి ఇంట్లో సుఖశాంతులు నెలకొనాలని కోరుకుంటూ, ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ వేడుక భక్తి, సంప్రదాయం, ఐక్యతకు నిలువెత్తు నిదర్శనంగా చిరస్థాయిగా నిలిచిపోతుందని అయినా పేర్కొన్నారు. కార్యక్రమంలో మాడ్గుల మండల పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచులు పవన్ కుమార్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రమేష్ రెడ్డి, యాదిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ పట్టాభి తిరుమల్ రెడ్డి, నారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, జెల్ల యాదయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివరాహస్వామి దేవస్థానం చైర్మన్ గా ముస్త్యాల దామోదర్

**పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారం..!**

అగ్నిధార న్యూస్ కమాన్ పూర్



కమానూర్ మండల కేంద్రంలోని స్వయంభూ ఆదివరాహస్వామి నూతన పాలక వర్గం సభ్యులు ఆదివారం జూలపల్లి గ్రామానికి చెందిన ముస్త్యాల దామోదర్ ను చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ తో పాటు పాలక వర్గం సభ్యులతో దేవదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ ప్రమాణ స్వీరకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో డైరెక్టర్లు చాట్ల రాయమల్లు, తాళ్ల భాగ్య, పిల్లి రాజు, సాగి శ్రీనివాసరావు, తిమ్మరాజు గిరిజ, తీగల రాజయ్య, కుందారపు శంకర్, గాజుల శ్రీనివాస్, బూస శ్రీనివాస్, బొజ్జ సతీష్, అనవేన శ్యామల, కొంతం శ్రీనివాస్, మల్యాల మల్లేష్ డైరెక్టర్లుగా ప్రమణ స్వీకారం చేశారు. ఎక్స్ ఆఫిసియో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాదచార్యులు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఆలయ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ముస్త్యాల దామోదర్ మాట్లాడుతూ.. ఆదివరహస్వామి దేవస్థానం ప్రాచీనమైనదని, స్వయంభూగా వెలిసిన క్షేత్రమని ఇక్కడ ఆలయ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుల సహయ సహకారాలతో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ ముస్త్యాల దామోదర్ కు , డైరెక్టర్లకు ఆత్మీయులు, శ్రేయోభిలాషులు శాలువాలు కప్పి ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు.

## రేవంత్ రెడ్డి హృదయం ఉన్న మనిషా.. కవిత వ్యాఖ్యలపై బాల్క సుమన్ కౌంటర్



ప్రజాస్వామ్య దేశంలో పార్టీలు పెట్టుకునే హక్కు ఎవరికైనా ఉందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. గతంలో పార్టీ పెట్టిన ఆల నరేంద్ర, నాగం జనార్ధన్ రెడ్డి, దేవేందర్ గౌడ్, విజయశాంతి, షర్మిల పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలుసని అన్నారు. కొత్త పార్టీ పెట్టిన కవిత ప్రతిపక్షాలపై అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం దారుణమని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రశ్నించాలి కానీ.. ప్రతిపక్షాన్ని తిట్టడమేంటని మండిపడ్డారు. దీన్ని బట్టే ఆమె ఎవరికోసం పార్టీ పెట్టారో అర్థమవుతుందని చెప్పారు. కేసీఆర్‌ను మరమనిషి అని కవిత అనడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. సంక్షేమం అందించిన వ్యక్తి మరమనిషి అవుతారా అని నిలదీశారు. 70 లక్షల రైతులకు రూ.73వేల కోట్ల రైతుబంధు ఇచ్చినందుకు కేసీఆర్ మర మనిషా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఎగ్గొట్టిన రేవంత్ హృదయం ఉన్న మనిషా అని మండిపడ్డారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేసిన కేసీఆర్‌ను విమర్శించే అర్హత కవితకు లేదని స్పష్టం చేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసిన వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జగిత్యాల :** పట్టణంలోని శారదా విద్యా నిలయం పాఠశాలలో 1999--2000 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి సహపాఠులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం , హెడ్మాస్టర్ పునుగోటి నీరజాకుమారి రంగారావు పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస కాలంలో పొందిన అనుభవాలను పంచుకుంటూ, గురువుల మార్గదర్శకత తమ జీవితాల్లో ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు. దాదాపు 24 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. దీనస్థితిలో , ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న సహచర మిత్రులకు సహాయ, సహకారాలు అందించాలని నిర్ణయించారు.

## శ్రీ కంఠ మహేశ్వర స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరి పై ఉండాలి



**విగ్రహ ప్రతిష్టాపన లో పాల్గొన్నా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడుగుల గ్రామంలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి సురమాంబ విగ్రహ ప్రతిష్టాపణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకునని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ధర్మం, భక్తి, సాంప్రదాయాల పరిరక్షణకు గ్రామాల్లో ఇటువంటి మహోత్సవాలు ఎంతో దోహద పడతాయని, ఆధ్యాత్మిక చైతన్యం సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుందని తెలుపుతూ, స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ఆలయ కమిటీ సభ్యులతో పాటు, స్థానిక నాయకులు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కమాన్ పూర్ లో జీవన రేఖ ఆసుపత్రి ప్రారంభం..



అగ్నిధార న్యూస్ కమాన్ పూర్,

కమాన్ పూర్ మండల కేంద్రంలో ఆదివారం జీవనరేఖ ఆసుపత్రిని స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించేందు ఇక్కడ ఆసుపత్రి ఏర్పాటు చేయడం పట్ల జీవన రేఖ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది మంచిగా సేవలు అందించి ప్రజల అభిమానం పొందాలని సూచించారు. రాత్రివేళల్లో ఏమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడితే దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఇక్కడ ఆసుపత్రి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సయిాద్ అన్వర్, మాజీ సింగిల్విండో చైర్మన్ ఇనగంటి బ్రాస్కర్ రావు, ఉప సర్పంచ్ రఫీక్ సోహెల్ తో పాటు జీవనరేఖ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు 32 క్వింటాళ్ల నిబంధనతో ఇబ్బందులు.. మిగతా ధాన్యం ఎక్కడ విక్రయించాలని ప్రశ్నిస్తున్న రైతులు

**గంగాధర, ఏప్రిల్ 26:** ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు 32 క్వింటాళ్ల నిబంధన ఇబ్బందులు కలిగిస్తోంది. యాసంగి సీజన్ లో ఒక్కో ఎకరానికి దాదాపు 36 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, ప్రభుత్వం ఎకరానికి 32 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో మిగిలిన ధాన్యం అమ్మడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

# సర్పంచ్ తండ్రి మరణం విషాదకరం



**పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్లు మండలం శంకరకొండ తండా సర్పంచ్ మండ్లి రాములు తండ్రి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ రాములు ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కాలే మల్లయ్య, అంబర్ సింగ్, విజయ్ నాయక్, విజయ్ రాథోడ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, దేవరశెట్టి మహేష్, రహీం, నవీన్ నాయక్, మెకానిక్ బాబా, రాఘవేందర్, డీలర్ కృష్ణ మరియు గ్రామ వాట్స్ సభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి



**కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం లోని వెంకటాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్య క్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కళ్యాణోత్సవ వేడుకల్లో పాల్గొని, స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ, స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ పాడి పంటలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో, సర్పంచ్ పుపమ్మ అంజన్ రెడ్డి, ఆలయ చైర్మన్ జగన్, మాజీ ఎంపిటిసి నరసింహ మూర్తి, వైస్ చైర్మన్ నిరంజన్, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, వార్డు సబ్యులు మల్లేశ్, యువనాయకులు శివరాజ్ గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జన్మ దిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి ఎమ్మెల్యే కసిరెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గ్రామ మాజీ సర్పంచ్ యేన్నం భూపతి రెడ్డి జన్మ దినశీ సందర్భంగా ఆయన నివాసానికి చేరుకొని శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, మోతీలాల్ నాయక్, సంజీవ్ కుమార్ యాదవ్, బచ్చు రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు

# సర్పంచ్ తండ్రి మరణం బాధాకరం

**మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆమనగల్ మండలంలోని శంకర్ కొండ తండా సర్పంచ్ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు తండ్రి అంజయ్య మరణ వార్త తెలుసుకొని వారి నివాసానికి చేరుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా కీ. శే.మండ్లి అంజయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు, అనంతరం మండ్లి రాములు తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు, మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజినెస్

### ముఖేశ్ అంబానీ ఇంటికి పాప్ సింగర్ రిహానా



ప్రముఖ పాప్ సింగ్ రిహానా భారత పర్యటనలో భాగంగా ముఖేశ్ అంబానీ ఇంటికి వచ్చారు. తన బృందంతో కలిసి అంబానీ కుటుంబాన్ని కలిశారు. అత్యంత సన్నిహితుల మధ్య స్పెషల్ డిన్నర్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిహానాకు ఇషా అంబానీ, శ్లోకా మెహతా, రాధికా మర్చంట్-అనంత్ అంబానీ దంపతులు ఆత్మీయ స్వాగతం పలికారు. భారతీయ నృత్యరీతులు, సంప్రదాయ కళలు, మన సంస్కృతికి సంబంధించిన విశేషాలను అంబానీ కుటుంబసభ్యులు రిహానాకు వివరించారు. ఇక రిలయన్స్ రిటైల్ సంస్థ భాగస్వామ్యంతో తన సొంత బ్యూటీ బ్రాండ్ ఫెంటీ బ్యూటీ ప్రమోషన్ కోసం రిహానా భారత్‌కు వచ్చారు. ఈ ఉత్పత్తులు ప్రస్తుతం తీరా సెఫోరా ప్లాట్‌ఫామ్‌ల్లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంది.

### ఒక వ్యక్తి ఎన్ని లోన్స్ తీసుకోవచ్చు

ఈ రోజుల్లో ఇల్లు కొనాలన్నా?, భూములు కొనాలన్నా?, కారు కొనాలన్నా?, ఆఖరికి బైక్ కొనాలన్నా కూడా చాలామంది బ్యాంక్ నుంచి లోన్ తీసుకుంటారు. అయితే ఇక్కడ చాలామంది మనసులో మెదిలే ప్రశ్న.. ఒక వ్యక్తి ఎన్ని లోన్స్ తీసుకోవచ్చు?, దీనికి ఏమైనా పరిమితులు ఉన్నాయా? అని. దీనికి సమాధానం ఈ కథనంలో తెలుసుకుందాం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం.. ఒక వ్యక్తి ఇన్నిసార్లు మాత్రమే లోన్ తీసుకోవాలి? అనే విషయంపై ఎలాంటి నిబంధన లేదు. కాబట్టి ఒకటి, రెండు లేదా అంతకంటే ఎక్కువ లోన్స్ తీసుకోవచ్చు. అయితే లోన్ ఇవ్వాలా?, వద్దా అనేది.. సదరు బ్యాంక్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మీకు లోన్ ఇచ్చేముందు.. ఏ బ్యాంక్ అయినా ముందుగా మీ డీఐఆర్ చెక్ చేస్తుంది. అంటే మీకు నెలకు వచ్చే ఆదాయం ఎంత?, అప్పటికే మీరు ఏదైనా ఈఎంఐ చెల్లిస్తున్నారా? అనే విషయాన్ని బ్యాంక్ గమనిస్తుంది. సాధారణంగా ఒక వ్యక్తికి వచ్చే ఆదాయంలో 35 శాతం ఈఎంఐ కోసం కేటాయించవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తికి నెలకు రూ. లక్ష జీతం అనుకుంటే.. అందులో రూ.35000 ఈఎంఐ కోసం కేటాయించుకోవచ్చు. అంతకంటే ఎక్కువ ఈఎంఐ కోసం కేటాయిస్తే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే బ్యాంక్ లోన్ ఇవ్వడానికి నిరాకరించే అవకాశం ఉంటుంది. ఒకవేళా మీరు చెల్లించే లోన్ ఈఎంఐ నెలకు రూ.10వేలు మాత్రమే అయితే.. అలాంటి సందర్భంలో మీకు మరో లోన్ సులభంగా వస్తుంది. ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే?.. లోన్ ఇచ్చే బ్యాంక్ మీ సిబిల్ స్కోర్ కూడా చూస్తుంది. గతంలో ఎప్పుడైనా లోన్ తీసుకున్నారా?, దాన్ని చెల్లించడంలో ఏదైనా జాప్యం జరిగిందా? అనే విషయాలను కూడా బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థలు గమనిస్తాయి. ఒక వ్యక్తి ఒకటికంటే ఎక్కువ లోన్స్ తీసుకోకూడదనే రూల్ ఎక్కడా లేదు. కానీ ఎక్కువ లోన్స్ తీసుకుంటే మీ ఆర్థిక పరిస్థితి కష్టమవుతుంది. మీరు తీసుకునే లోన్ అప్పటికి ఉపశమనం కలిగించవచ్చు. భవిష్యత్తులో భారమవుతుంది. కాబట్టి ఒకటి కంటే ఎక్కువ లోన్స్ తీసుకునేవారు తప్పకుండా.. ఈ విషయాలను గుర్తుంచుకోవాలి. "అప్పు తప్పు కాదు.. కానీ అప్పు ఎక్కువైతే ముప్పు" తెస్తుంది.

# ఐటీలో ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ :** దేశీయ ఐటీ కంపెనీలు వ్యయ నియంత్రణ దిశగా అడుగులు వేస్తున్నాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా భారతీయ టాప్-5 ఐటీ సంస్థలు అవకాశం ఉన్నప్పుడల్లా ఉద్యోగుల్ని తగ్గించుకోవడంపైనే దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏకంగా 23,460 మంది ఉద్యోగుల్ని తొలగించింది. టెక్ మహీంద్రా సైతం 1,108 మందిని తీసేసినట్టు తాజా గణాంకాలు చెప్తున్నాయి. ఫలితంగా ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీ కంపెనీలు దాదాపు 18వేల మంది ఉద్యోగుల్ని నియమించుకున్నా.. టాప్-5 సంస్థల్లో నికరంగా ఉద్యోగులు సుమారు 7వేలు తగ్గినట్టే లెక్కల్లో తేటతెల్లమవుతున్నది.



**2023-24లో..**

2023-24 ఆర్థిక సంవత్సరంలో హెచ్‌సీఎల్ టెక్ మినహా మిగతా అగ్రశ్రేణి కంపెనీలు ఉద్యోగ నియామకాలకు బదులుగా తొలగింపులకే ప్రాధాన్యతనిచ్చాయి. ఇన్ఫోసిస్ దాదాపు 26వేలు, విప్రో 24,500కుపైగా, టీసీఎస్ 13వేలకుపైగా ఎంప్లాయిస్‌ను తీసేశాయి. టెక్ మహీంద్రా సైతం సుమారు 7వేల ఉద్యోగులపై వేటు వేసింది. ఫలితంగా ఆ ఏడాది ఆయా కంపెనీల్లో నికరంగా ఉద్యోగుల సంఖ్య ఇంచుమించు 70వేలు పడిపోయింది. హెచ్‌సీఎల్ టెక్ కూడా స్వల్పంగా 1,537 మందినే నియమించుకున్నది. అయితే 2024-25లో మాత్రం హెచ్‌సీఎల్ టెక్ మినహా టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా ఉద్యోగుల్ని తీసుకున్నాయి. వీటి ఉద్యోగుల సంఖ్య ఆ ఏడాది దాదాపు 13వేలు పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్ 4వేలకుపైగా ఉద్యోగుల్ని తొలగించింది. కాగా, ఈ 5 సంస్థలు 2022-23లో దాదాపు 84వేలు, 2021-22లోనైతే 2.73 లక్షలకుపైగా మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం గమనార్హం.

**ఇదీ సంగతి..**

దేశీయ ఐటీ రంగ సంస్థలకు విదేశీ మార్కెట్‌లోని ప్రాజెక్టుల నుంచే ఎక్కువగా ఆదాయం వస్తుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, దీనికి తగ్గట్టుగా క్లైయింట్లు నెమ్మదిగా తీసుకుంటున్న నిర్ణయాలు.. వ్యాపారావకాశాలను దెబ్బతీస్తున్నాయి. రాబడులు క్షీణిస్తున్నాయి. ఇక ఏఐ వినియోగం పెరుగడం కూడా ఐటీ రంగంలో ఉద్యోగ నియామకాలను మందగించేలా చేస్తున్నదన్న అభిప్రాయాలు పరిశీలకుల నుంచి వినిపిస్తున్నాయి.

**59 లక్షలుగా ఉద్యోగులు**

బడా ఐటీ సంస్థలు ఉద్యోగ నియామకాలపై ఆచితూచి వ్యవహరిస్తున్నా.. ఓవరాల్‌గా దేశీయ ఐటీ ఇండస్ట్రీలో మాత్రం ఉద్యోగుల పెరుగుదలే కనిపిస్తున్నది. దీంతో ఇప్పటికైతే ఇది సానుకూల అంశంగానే చూడాల్సి వస్తున్నది. ఇక ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి 59 లక్షల ఐటీ ఉద్యోగులున్నట్టు నాస్కామ్ చెప్తున్నది. గడిచిన ఏడాది కాలంలో 1.4 లక్షలు పెరిగారు. అంతకుముందు ఏడాది కాలంలో 1.3 లక్షల ఉద్యోగులు పెరిగినట్టు ఈ సాఫ్ట్‌వేర్

# భారత్‌లో 20 ఏళ్లు.. ఉత్పత్తిలో కోటి!

సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా.. భారతదేశంలో తన తయారీ కార్యకలాపాలను ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఎప్పటికప్పుడు కొత్త వాహనాలను పరిచయం చేయడం, భవిష్యత్ మొబిలిటీ పరిష్కారాలపై నూతన దృష్టి సారించడం వంటివి చేయడం వల్ల కంపెనీ ప్రత్యర్థులకు సైతం గట్టి పోటీ ఇస్తోంది. సుజుకి మోటార్ కార్పొరేషన్ యొక్క అనుబంధ సంస్థ అయిన ఈ కంపెనీ.. మొత్తం 10 మిలియన్ల ద్విచక్ర వాహనాల ఉత్పత్తి మైలురాయిని దాటినట్లు అధికారికంగా ప్రకటించింది. స్థిరమైన వినియోగదారుల డిమాండ్.. నిరంతర ఉత్పత్తి ఆవిష్కరణల మద్దతుతో, గత నాలుగేళ్లలో తమ అమ్మకాలు రెట్టింపు అయ్యాయని సంస్థ వెల్లడించింది. సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా ప్రస్తుతం పటిష్టమైన సరఫరాదారుల వ్యవస్థ మద్దతుతో, భారతదేశం అంతటా 1,200కు పైగా టచ్‌పాయింట్‌లతో కూడిన విస్తృత నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. భారతదేశంలో దీని ప్రయాణం 2006లో సుజుకి హీట్ 125 మరియు సుజుకి జీయస్ 125 వంటి మోటార్‌సైకిళ్లతో ప్రారంభమైంది. ఆ తర్వాత 2007లో సుజుకి యాక్సెస్ 125ను విడుదల చేశారు. ఈ మోడల్ అమ్మకాలలో కీలక పాత్ర పోషించి, 125ఎఎ స్కూటర్ విభాగాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సహాయపడింది. కాలక్రమేణా..సుజుకి గిక్సర్ సిరీస్, సుజుకి వి-స్ట్రోమ్ ూాశ వంటి మోటార్‌సైకిళ్లతో పాటు, సుజుకి బర్గ్‌మాన్ స్ట్రీట్, సుజుకి అవెనిస్ వంటి ఉత్పత్తులతో సుజుకి తన పోర్ట్‌ఫోలియోను మరింతగా ముందుకు తీసుకెళ్లాయి. సుజుకి హయబుసా, సుజుకి +ూాశ-8= వంటి



దాని ప్రీమియం మోడళ్లు, వివిధ విభాగాలలో దాని ఉనికిని మరింత బలోపేతం చేశాయి.

# కోల్‌కతా వదల్లేదు



మొదట కోల్‌కతా నైట్‌రైడర్స్ చచ్చీ చెడీ 155 పరుగులు చేసింది. లఖ్‌నవూ అలవోకగా ఆ లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఒక దశ వరకు ఆట సాగిన తీరు చూస్తే.. ఈ ఐపీఎల్‌లో అత్యంత బోరింగ్ మ్యాచ్‌ల్లో ఇదొకటనిపించింది. కానీ తర్వాత అనూహ్య మలుపులు తిరిగిన మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసి.. అందరి దృష్టినీ తనవైపు తిప్పుకుంది. పన్నెండేళ్ల కిందట కరీబియన్ లీగ్‌లో సూపర్ ఓవర్లో మెయిడెన్ వేసి సంచలనం సృష్టించిన సునీల్ నరైన్.. ఇప్పుడు ఐపీఎల్‌లో అద్భుతం చేశాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు తీసి ఎల్ఎస్‌జీ ఓటమిని శాసించాడు. మ్యాచ్‌పై పూర్తిగా ఆశలు కోల్పోయిన స్థితిలో మేటి ఇన్నింగ్స్‌తో కోల్‌కతాకు పోరాడే స్కోరునందించిన రింకు అసలైన హీరో.

లఖ్‌నవూ: పేలవ ప్రదర్శన చేస్తోన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు వరుసగా అయిదో పరాభవం. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ సూపర్ ఓవర్లో లఖ్‌నవూపై నెగ్గింది. రింకు (83 నాటౌట్; 51 బంతుల్లో 7ఐ4, 5ఐ6) ఆదుకోవడంతో మొదట కోల్‌కతా 7 వికెట్లకు 155 పరుగులు చేసింది. మోసిన్ ఖాన్ (5/23) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో తడబడ్డ లఖ్‌నవూ కూడా 20 ఓవర్లలో 8 వికెట్లకు సరిగ్గా 155 పరుగులే చేసింది. పంత్ (42; 38 బంతుల్లో 4ఐ4, 1ఐ6), మార్‌క్రమ్ (31) రాణించారు. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ తప్పలేదు. అక్కడ లఖ్‌నవూ పూర్తిగా తేలిపోయింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన నరైన్ ఒక్క పరుగే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టి, లఖ్‌నవూ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మొదటి బంతికి పూరన్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో బంతికి మార్‌క్రమ్‌ను వెనక్కి పంపాడు. ఛేదనలో తొలి బంతికే రింకు ఫోర్ కొట్టడంతో విజయం కోల్‌కతా సొంతమైంది. 8 మ్యాచ్‌ల్లో ఇది కోల్‌కతాకిది రెండో విజయం. ఎల్ఎస్‌జీకిది మొత్తంగా ఆరో ఓటమి.

మోసిన్ ఖాన్ (5/23)


లఖ్‌నవూ తడబాటు: లక్ష్యం చిన్నదే అయినా ఛేదనలో లఖ్‌నవూ పరుగుల కోసం చెమటోడ్చింది. రెండో ఓవర్లోనే మార్ష్ ఔటయ్యాక.. మార్‌క్రమ్, కెప్టెన్ పంత్ నిలబడ్డారు. కానీ కేకేఆర్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బ్యాట్ ఝుళిపించలేకపోయారు. 10 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 63 మాత్రమే. సాధించాల్సిన రన్‌రేట్ దాదాపు పదికి చేరుకుంది. ఆ దశలో మార్‌క్రమ్‌ను గ్రీన్ ఔట్ చేశాడు. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ పూరన్ (9) కూడా వెంటనే నిష్క్రమించడంతో ఎల్ఎస్‌జీ ఛేదన మరింత కష్టంగా మారింది. 15వ ఓవర్లకు స్కోరు 92/4. చివరి 5 ఓవర్లలో 64 పరుగులు చేయాల్సిన స్థితిలో ఎల్ఎస్‌జీపై ఒత్తిడి బాగా పెరిగిపోయింది. ఆపై ముకుల్ చౌదరి (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. కానీ ఆ స్థితిలో హిమ్మత్ (19) ఓ సిక్స్.. బదోని (24) రెండు సిక్స్‌లతో లఖ్‌నవూను రేసులో నిలిపారు. సాధించాల్సిన రన్‌రేట్ మరీ పెరిగిపోకుండా చూశారు. చివరి మూడు ఓవర్లలో లఖ్‌నవూకు 38 పరుగులు అవసరమయ్యాయి. అయితే ఊపు మీదున్న బదోనిని ఔట్ చేసిన వరుణ్.. 18వ ఓవర్లో 10 పరుగులిచ్చాడు. తర్వాతి ఓవర్లో అరోరా.. లిండ్ (8)ను వెనక్కి పంపి 11 పరుగులిచ్చాడు. ఆఖరి ఓవర్లో లఖ్‌నవూ 17 పరుగులు చేయాల్సిన స్థితిలో కేకేఆర్‌కే అవకాశాలు ఎక్కువ. కానీ ఆఖరి ఓవర్లో కార్తీక్ త్యాగి అత్యంత పేలవంగా బౌలింగ్ చేశాడు. తొలి బంతికి సింగిల్ వచ్చాక వరుసగా రెండు నోబాల్స్ వేశాడు. రెండో నోబాల్‌కు రెండు పరుగులు కూడా వచ్చాయి. 5 బంతుల్లో లఖ్‌నవూకు 12 పరుగులు అవసరం కాగా.. హిమ్మత్ ఓ బౌండరీ కొట్టి, తర్వాతి బంతికి వెనుదిరిగాడు. ఆ తర్వాతి రెండు బంతుల్లో ఒక్క పరుగే రావడంతో ఆఖరి బంతికి లఖ్‌నవూ ఏడు పరుగులు చేయాల్సిన పరిస్థితి. షమి (11 నాటౌట్) సిక్స్ బాదడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. నరైన్ అద్భుత బౌలింగ్‌తో సూపర్ ఓవర్లో కేకేఆర్ పైచేయి సాధించింది.

ఆదుకున్న రింకు: అంతకుముందు కోల్‌కతా తేలిపోయింది. పేలవ బ్యాటింగ్‌ను కొనసాగించింది. మోసిన్ ఖాన్ ధాటికి బెంబేలెత్తిపోయిన ఆ జట్టు 31కే 4 వికెట్లు కోల్పోయింది. 11 ఓవర్లు ముగిసే సరికి 73/6తో నిలిచింది. ఆ దశలో కేకేఆర్ 150 దాటగలదని ఎవరూ అనుకోలేదు. కానీ రింకు సింగ్ ఆ జట్టును ఆదుకున్నాడు. ముఖ్యంగా ఆఖరి రెండు ఓవర్లలో చెలరేగిపోయాడు. షమి వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో వరుసగా 6, 4, 4 దంచేసిన అతడు.. 20వ ఓవర్లో దిగ్వేశ్ రాఠి బౌలింగ్‌లో వరుసగా 6, 6, 6, 6 బాదేశాడు.

కోల్‌కతా ఇన్నింగ్స్: రహానె (సి) మార్‌క్రమ్ (బి) మోసిన్ ఖాన్ 10; సీఫర్ట్ (సి) ముకుల్ చౌదరి (బి) మోసిన్ ఖాన్ 0; రఘువంశీ అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్ 9; గ్రీన్ (సి) పంత్ (బి) మోసిన్ ఖాన్ 34; రోమన్ పావెల్ (సి) పంత్ (బి) మోసిన్ ఖాన్ 1; రింకు సింగ్ నాటౌట్ 83; అనుకుల్ రాయ్ (సి) బదోని (బి) మోసిన్ ఖాన్ 0; రమణ్‌దీప్ సింగ్ (సి) మార్ష్ (బి) లిండ్ 6; నరైన్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 155; వికెట్ల పతనం: 1-3, 2-16, 3-27, 4-31, 5-73, 6-73, 7-93; బౌలింగ్: షమి 4-0-34-0; మోసిన్ ఖాన్ 4-1-23-5; ప్రిన్స్ యాదవ్ 4-0-24-0; దిగ్వేశ్ రాఠి 4-0-46-0; జార్జ్ లిండ్ 2-0-18-1; మార్‌క్రమ్ 2-0-9-0

# సుదర్శన్ గెలిపించెన్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్.. సాయి సుదర్శన్ సెంచరీ కొట్టాడు.. గుజరాత్ భారీ స్కోరు చేసింది. కానీ ఆర్సీబీ మ్యాచ్‌ను ఎగరేసుకుపోయింది. సుదర్శన్ మళ్లీ కొట్టాడు. ఈసారి ఛేదనలో జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. మందకొడిగా ఉన్న పిచ్‌పై రబాడ విజృంభణతో చెన్నై అతి కష్టం మీద 158 పరుగులు చేస్తే.. అదే పిచ్‌పై లోకల్ బాయ్ సుదర్శన్ అదిరే ఇన్నింగ్స్‌తో టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ గెలుపుతో గుజరాత్ 8 పాయింట్లతో అయిదో స్థానానికి చేరింది. ఈ సీజన్లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై.. 8 మ్యాచ్‌ల్లో 5 ఓడి, 6 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది.



గుజరాత్ టైటాన్స్ గాడిలో పడింది. వరుసగా రెండు ఓటముల తర్వాత ఓ విజయాన్ని అందుకుంది. ఆదివారం ఆ జట్టు 8 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను చిత్తు చేసింది. మొదట చెన్నై 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (74 నాటౌట్; 60 బంతుల్లో 6ఐ4, 4ఐ6) టాప్ స్కోరర్. రబాడ (3/25) అదిరే ప్రదర్శన చేయగా.. అర్షద్ ఖాన్ (2/43), సిరాజ్ (1/23) కూడా ప్రత్యర్థి పతనంలో పాలుపంచుకున్నారు. సాయి సుదర్శన్ (87; 46 బంతుల్లో 4ఐ4, 7ఐ6) మెరుపులతో గుజరాత్ 16.4 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. శుభ్‌మన్ గిల్ (33; 23 బంతుల్లో 1ఐ4, 3ఐ6), బట్లర్ (39 నాటౌట్; 30 బంతుల్లో 4ఐ4, 1ఐ6) రాణించారు.

గుజరాత్ కష్టపడకుండా..: ఛేదనలో గుజరాత్ అదరగొట్టింది. గత మ్యాచ్‌లో బెంగళూరుపై సెంచరీ చేసిన సాయి సుదర్శన్ మరోసారి సత్తా చాటాడు. ఇంకో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అండతో గట్టి పునాది వేసిన సుదర్శన్.. ఆపై బట్లర్ తోడుగా గుజరాత్‌ను విజయపథంలో నడిపించాడు. ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది మాత్రం శుభ్‌మనే. హొసీన్ వేసిన తొలి ఓవర్లో 6, 4 బాదిన గిల్.. ఆ తర్వాత ఓవర్టన్ (3వ ఓవర్)కు సిక్స్ రుచి చూపించాడు. ఇదే ఓవర్లో సుదర్శన్ కూడా ఓ సిక్స్ బాదడంతో పవర్ ప్లే ఆఖరికి గుజరాత్ 55/0తో నిలిచింది. కుదురుకున్న గిల్‌ను నూర్ అహ్మద్ ఔట్ చేసినా.. గుజరాత్ ఏమీ తగ్గలేదు. సుదర్శన్, బట్లర్ ప్రశాంతంగా ఆడుతూ లక్ష్యాన్ని కరిగించారు. ఇదే క్రమంలో సుదర్శన్ 33 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. తర్వాత అతను మరింత ధాటిగా ఆడాడు. హొసీన్, గుర్జాప్‌నీత్ ఓవర్లలో రెండేసి సిక్స్‌లు బాది జీటీని విజయానికి మరింత చేరువ చేశాడు. హొసీన్ వేసిన 17వ ఓవర్లో బ్రెవిస్ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు సుదర్శన్ వెనుదిరిగినా.. అదే ఓవర్లో బట్లర్ ఓ సిక్స్ బాది ఛేదనను పూర్తి చేశాడు. 20 బంతులు మిగిలుండగానే గుజరాత్ గెలిచింది.

రబాడ 3/25

చెన్నై ఆపసోపాలు!: 3 ఓవర్లకు 21/0.. 6 ఓవర్లకు 28/3.. 20 ఓవర్లకు 158/7.. ఇదీ అంతకుముందు చెన్నై ఇన్నింగ్స్ సాగిన తీరు. తక్కువ స్కోరుకే ఆలౌట్ అయ్యేలా కనిపించిన ఆ జట్టును రుతురాజ్ ఆదుకున్నాడు. ఈ సీజన్లో ఒక్క పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయిన అతడు.. గుజరాత్‌పై ఆఖరిదాకా నిలిచి చెన్నై ఓ పోరాడే స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. తొలి 3 ఓవర్లలో మెరుగ్గానే ఆడిన చెన్నై.. ఆ తర్వాత రెండు ఓవర్ల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. గత మ్యాచ్‌లో సెంచరీతో జట్టు విజయంలో కీలకమైన సంజు శాంసన్ (11)తో పాటు సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన ఉర్విల్ పటేల్ (4)లను రబాడ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. తర్వాత సర్ఫరాజ్ డకౌట్ అయ్యాడు. ఈ వికెట్ సిరాజ్ ఖాతాలో చేరింది. పవర్ ప్లే ఆఖరికి చెన్నై 28/3తో నిలిచింది. ఈ స్థితిలో రుతురాజ్ జట్టును ఆదుకున్నాడు. శివమ్ దూబె (22) సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కుదురుకున్నాక వీళ్లిద్దరూ కాస్త ధాటిగా ఆడడంతో 15 ఓవర్లకు 96/4తో చెన్నై కోలుకుంది. దూబె, కార్తీక్ శర్మ (15) ఔటైనా.. ఓవర్టన్‌తో కలిసి రుతురాజ్ పోరాటాన్ని కొనసాగించాడు. ఈ క్రమంలో రుతురాజ్ 49 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. ఆఖరి ఓవర్లో అతను 3 ఫోర్లు కొట్టడంతో చెన్నై 160కి సమీపంగా స్కోరు చేయగలిగింది. చివరి 8 ఓవర్లలో సీఎస్కే 107 పరుగులు రాబట్టింది.


చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ (సి) బట్లర్ (బి) రబాడ 11; రుతురాజ్ నాటౌట్ 74; ఉర్విల్ పటేల్ (సి) హోల్డర్ (బి) రబాడ 4; సర్ఫరాజ్ ఖాన్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0; బ్రెవిస్ (సి) గిల్ (బి) సుతార్ 2; శివమ్ దూబె (బి) అర్షద్ 22; కార్తీక్ శర్మ (సి) హోల్డర్ (బి) రబాడ 15; ఒవర్టన్ (సి) షారుక్ (బి) అర్షద్ 18; అకీల్ హొసీన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 158
వికెట్ల పతనం: 1-21, 2-25, 3-26, 4-37, 5-96, 6-122, 7-143
బౌలింగ్: సిరాజ్ 4-0-23-1; రబాడ 4-0-25-3; మానవ్ సుతార్ 3-0-22-1; హోల్డర్ 4-0-22-0; అర్షద్ ఖాన్ 4-0-43-2; రషీద్ ఖాన్ 1-0-21-0
గుజరాత్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) బ్రెవిస్ (బి) హొసీన్ 87; శుభ్‌మన్ గిల్ (స్టంప్డ్) శాంసన్ (బి) నూర్ అహ్మద్ 33; బట్లర్ నాటౌట్ 39; సుందర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం: (16.4 ఓవర్లలో 2 వికెట్లకు) 162; వికెట్ల పతనం: 1-58, 2-155
బౌలింగ్: అకీల్ హొసీన్ 3.4-0-46-1; అన్షుల్ కాంబోజ్ 3-0-16-0; జేమీ ఒవర్టన్ 2-0-28-0; గుర్జాప్‌నీత్ సింగ్ 3-0-36-0; నూర్ అహ్మద్ 4-0-29-1; శివమ్ దూబె 1-0-7-0

## అది స్త్రీకి దేవుడు ఇచ్చిన హక్కు



'పిల్లల్ని కనడానికి పెళ్లే అవసరం లేదు. ఒక ప్రాణానికి జన్మనివ్వాలనే కోరికను సామాజిక హోదాతో ముడిపెట్టాల్సిన అవసరం లేదు' అంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చేసింది సహజనటి నిత్యామీనన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి ఆమె మాట్లాడిన మాటలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. 'నేను పెళ్లికి వ్యతిరేకం కాదు. కానీ కొందరు పెళ్లి లేనిదే జీవితమే వ్యర్థం అన్నట్టు మాట్లాడుతుంటారు. వారికి నేను వ్యతిరేకం. మరో జీవికి జన్మనివ్వడం అనేది జన్మతహః స్త్రీకి భగవంతుడిచ్చిన హక్కు. దానికి పెళ్లితో ప్రమేయం లేదు. తల్లి కావాలనుకోవడం పూర్తిగా వ్యక్తిగత నిర్ణయం' అని పేర్కొన్నది నిత్యామీనన్.


## పోలీస్‌ఆఫీసర్ తిరుపతి తడాఖా



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రలుగా రూపొందుతున్న థ్రిల్లర్ మూవీ 'కామాఖ్య'. అభినయ కృష్ణ దర్శకుడు. వడ్డేపల్లి శ్రీవాణీనాథ్ర, యశ్వంత్ రాజ్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఇందులో సముద్రఖని 'తిరుపతి' అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోలీస్ ఆఫీసర్ తిరుపతిగా అద్భుతమైన స్క్రీన్ ప్రెజన్స్‌తో సముద్రఖనిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రమేశ్ కుశేందర్‌రెడ్డి, సంగీతం: గ్యాని, నిర్మాణం: మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రై.లిమిటెడ్.

## మంగాపురం బాలు

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. డా.మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రషా తడానీ కథానాయిక. ఆర్‌ఎక్స్ 100, మంగళవారం చిత్రాల ఫేం అజయ్ భూపతి దర్శకత్వంలో పి.కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అగ్రనిర్మాత సి.అశ్వనీదత్ సమర్పకుడు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో యాక్టర్ బ్రహ్మాజీ 'బాలు' అనే ఓ కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. మైక్ పట్టుకొని హ్యాపీ వైబ్‌లో కనిపిస్తున్న బ్రహ్మాజీని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇందులో ఆయన పోషిస్తున్న బాలు పాత్ర ప్రేక్షకుల్ని పక్కాగా ఎంటర్‌టైన్ చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈచిత్రానికి కెమెరా: జయకృష్ణ ఐఎస్‌సీ, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: చందమామ కథలు



## ఊహాకందని కలయిక?



'అఖండ 2' తర్వాత బోయపాటి శ్రీను ఏ హీరోతో సినిమా చేస్తారు? అనేది ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. బన్నీతో బోయపాటి సినిమా ఉంటుందనే వార్త కూడా మీడియా సర్కిల్స్‌లో వినిపించింది. అయితే.. బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమాతో బిజీగా ఉన్నారు. వచ్చే ఏడాది దాకా ఆయన దొరకడం కష్టం. మిగతా స్టార్ హీరోలు కూడా వారివారి ప్రాజెక్టులతో బిజీబిజీగా ఉన్నారు. దాంతో బోయపాటి తన నెక్స్ట్ సినిమాను ఎవరితో చేస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో ఎవరూ ఊహించని విధంగా, తెలుగు ప్రేక్షకులకు ఇష్టమైన కోలీవుడ్ హీరో కార్తీతో బోయపాటి సినిమా చేయనున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ఓ వార్త వెలుగు చూసింది. కాన్సెప్ట్ ఓరియెంటెడ్ ఎంటర్‌టైనర్లను ఎక్కువగా చేసే కార్తీ.. బోయపాటి సినిమా చేస్తే అది నిజంగా ఆడియన్స్‌కి సర్‌ప్రైజే. కార్తీ కూడా ఓ కొత్త ప్రయత్నం చేసినట్టే. మరి ఈ వార్తలో నిజం ఎంత ఉందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## లెజెండరీ సింగర్ బయోపిక్‌లో?

ప్రస్తుతం రుక్మిణీ వసంత్‌కి మహర్దశ నడుస్తున్నది. పానిండియా బ్లాక్‌బస్టర్ 'కాంతార 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది ఈ కన్నడ కస్తూరి. ప్రస్తుతం 'ఎన్టీఆర్‌నీల్' చిత్రంలో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉన్నది. తాజా సమాచారం ప్రకారం ఈ అందాలభామకు మరో అద్భుతమైన అవకాశం వరించిందని ఇన్‌సైడ్ టాక్. వివరాల్లోకెళ్తే.. మహాగాయని ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్ తెరకెక్కించేందుకు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి సన్నాహాలు చేసుకుంటున్న విషయం విదితమే. ఇందులో సుబ్బులక్ష్మి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నదని వార్తలు కూడా వచ్చాయి. అయితే.. తాజా సమాచారం ప్రకారం సాయిపల్లవి స్థానాన్ని రుక్మిణీవసంత్ రీప్లేస్ చేసిందట. సూపర్‌స్టార్‌డమ్ ఉన్న సాయిపల్లవి కంటే, ఎలాంటి ఇమేజ్ లేని రుక్మిణీ వసంత్ అయితే.. ఆ పాత్రకు సరైన న్యాయం జరుగుతుందని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి భావించారట. అందుకే.. ఆ పాత్ర కోసం ఇటీవలే రుక్మిణీ వసంత్‌ని ఆయన కలిసినట్టు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌పై అధికారికంగా క్లారిటీ ఇంకా రావాల్సివుంది.



## అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న సామాన్యుడి కథ



'దర్శకుడు విఘ్నేష్‌రాజా గొప్ప సినిమా తీశాడు. అతని పేరు భవిష్యత్‌లో బాగా వింటారు. అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న ఓ సామాన్యుడి కథ ఇది. నిర్మాత సపోర్ట్ వల్లే సినిమా బాగా వచ్చింది. నమిత ప్రతిభ గల నటి. కెమెరా ముందు విశ్వరూపం చూపించింది. మంచి నటీనటులు ఇందులో భాగమయ్యారు. జీవి ప్రకాశ్ అద్భుతమైన పాటలు ఇచ్చాడు. గ్లోబల్‌గా నచ్చే కాన్సెప్ట్ ఇది. ఏప్రిల్ 30న వస్తుంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి ' అని తమిళ అగ్ర నటుడు ధనుష్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'కర'. మమితాబైజు కథానాయిక. విఘ్నేష్ రాజా దర్శకుడు. ఐషరీ కె.గణేశ్ నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ధనుష్ మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన సాయిదుర్గతేజ్ మాట్లాడుతూ 'గొప్ప టీమ్ పనిచేసిన ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని నా నమ్మకం. నటుడిగా నాకు ధనుష్ ఆదర్శం. ఈ సినిమాలో ఆయన అద్భుతంగా నటించినట్టు ట్రైలర్ చెబుతున్నది. అందరితోపాటు నేనూ ఈ సినిమాకోసం ఎదురుచూస్తున్నా. ఆల్‌ది బెస్ట్ 'కర' టీమ్' అని సాయిదుర్గతేజ్ అన్నారు. కె.ఎస్.రవికుమార్, కుష్మిత గణేశ్ తదితర చిత్రబృందంతోపాటు దర్శకులు వెంకీ అట్లూరి, బుచ్చిబాబు సానా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com